
రాజధాని అంశంలో వైసీపీ ప్రవర్తన పరాకాష్టకు చేరింది. పార్టీగా కాకుండా నాటక సంస్థలా వ్యవహరిస్తోంది. అమరావతిని విమర్శించే ముందు తమ గత నిర్ణయాలు, విధానాలు గుర్తు చేసుకోవాలి. ప్రజలను గందరగోళానికి గురిచేసే రాజకీయాల కంటే స్పష్టమైన దృక్పథంతో ముందుకు రావడం అవసరం.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

మంగళవారం 07.04.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్


తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 350 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

- జలధారతో ప్రతీ ఎకరానికి నీరు
- నీరు ఉంటే... సంపద ఉన్నట్లే
- రాష్ట్రానికి ద్రోహం చేసిన పార్టీ వైసీపీ
- యాడికి 'జలధార' సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- నీటి భద్రత.. సాగునీటి సంఘాల బాధ్యత యాప్ లాంచ్
- అమరావతికి చట్టబద్ధతపై సీమ ప్రజల హర్షం
- తాడిపత్రి నియోజకవర్గ అభివృద్ధి నివేదికను ప్రజల ముందుంచిన సీఎం

# జల సంరక్షణ

## 100 రోజుల యాక్షన్ ప్లాన్!



**తాడిపత్రి(జర్నలిస్ట్ ఫైల్) :** జలమే సంపద... దాన్ని ఎంత పొదుపుగా వినియోగించుకుంటే అంత సంపదను సృష్టించవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. 'జలధార'తో రాష్ట్రంలోని ప్రతీ ఎకరాకు సాగునీరు అందించేలా జలహారతి కార్యాచరణ చేపడదామని పిలుపునిచ్చారు. అనంతపురం జిల్లా, యాడికిలో 'జలధార..నీటి భద్రత-సాగు నీటి సంఘాల బాధ్యత' అనే కార్యక్రమంలో పాల్గొని 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను ముఖ్యమంత్రి విడుదల చేశారు. అనంతరం నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత పేరుతో రూపొందించిన యాప్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ....నీరు మనందరికీ సర్వస్వమని, నీటిని సంరక్షించుకోడానికే వంద రోజుల యాక్షన్ ప్లాన్ చేపట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 'రాష్ట్రవ్యాప్తంగా నీటి భద్రత కోసమే పనిచేస్తున్నాం. పరిగెత్తే నీటిని నిలబెట్టాలి, నిలబడిన నీటిని నిల్వ చేయాలి..నిలబడిన నీటిని జలాశయంలో చేసేందుకు ప్రయత్నించాలి. నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లు, తుంపర సేద్యం, సూక్ష్మసేద్యం లాంటి అనేక ప్రయత్నాలు చేసి ముందుకు వెళ్లాం. పంట కుంటలు, కాలువలు, చెరువుల్లో మట్టి తీసి పొలాలకు వేశాం. ఎన్టీఆర్ జలసిరి ద్వారా ట్రెంచ్‌లు, నీరు చెట్టు, నీరు-మీరు, నీరు-ప్రగతి లాంటి అనేక కార్యక్రమాలు చేపట్టాం. నీటి భద్రతా కార్యక్రమంలో రైతులు, సాగునీటి సంఘాల లాంటి భాగస్వాములతో ఈ తరహా కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నాం. అనంతపురం లాంటి ప్రాంతాల్లో కొన్ని ఏళ్లపాటు నీరే లేదు. నష్టపోతున్న రైతులను ఆదుకోడానికి ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చింది కూడా టీడీపీనే. అనంతపురం జిల్లాలో నీటిని సద్వినియోగం చేసుకోవాలని డ్రిప్ ఇరిగేషన్ కార్యక్రమం తీసుకువచ్చాం. 90 శాతం మేర సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను ఇచ్చింది కూడా గతంలో మేమే. మైక్రో ఇరిగేషన్‌పై గతంలో ఇచ్చిన నివేదికే ప్రామాణికంగా మారి దేశంలో అంతా వినియోగించే పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం మైక్రో ఇరిగేషన్‌లో రూ.1,031 కోట్లు వ్యయం చేస్తూ దేశంలో నెంబర్ వన్‌గా ఉన్నాం. డ్రిప్ ఇరిగేషన్ వల్లే రాయలసీమ హార్టికల్చర్ హబ్‌గా మారింది. హార్టికల్చర్‌లో దేశంలో అగ్రస్థానంలో ఉన్నాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

**పూర్వోదయతో సీమ అభివృద్ధి :** రాయలసీమ అభివృద్ధికి ఒక ప్లాన్ ప్రకారం ముందుకెళ్తున్నామని, కేంద్రం ప్రవేశపెట్టిన పూర్వోదయ పథకం ద్వారా రూ.30 వేల కోట్లు వస్తాయన్నారు. 'పెట్టుబడులు ద్వారా మరో రూ.70 వేల కోట్ల రాబట్టి అభివృద్ధి చేస్తాం. గడిచిన 21 నెలల్లో నీటి భద్రతా పరంగా చాలా మార్పులు వచ్చాయి. చెరువులు పెద్ద ఎత్తున నింపగలిగాం. జల సంరక్షణా చర్యల కారణంగా భూగర్భ జలాలను 1.92 మీటర్ల మేర అదనంగా పెంచగలిగాం. గత ఏడాది వేసవి ముందు 8, వేసవి తర్వాత 3 మీటర్లుగా భూగర్భజలాలు ఉన్నాయి. అనంతపురం జిల్లాలో గతంలో 13 మీటర్ల మేర ఉంటే ఇప్పుడు 11 మీటర్లకే భూగర్భ జలాలు అందుబాటులోకి వచ్చాయి. చేపట్టిన భూసంరక్షణ చర్యల కారణంగా 2.2 మీటర్ల మేర జలాలు పెరగటం సంతోషం కలిగిస్తోంది. అన్నమయ్య జిల్లాల్లో దీనిని ఓ ప్రజాఉద్యమంగా చేపట్టి విజయం సాధించారు. ఈ ఉద్యమంలో ప్రజలందరికీ నేను తోడుగా ఉంటాను. జిల్లాలో 5.7 టీఎంసీల నీళ్లు అందుబాటులోకి వచ్చాయి. 20 వేలకుపైగా ఎండిన బోర్లలో నీరు అందుబాటులోకి వచ్చింది. ఒక్క జిల్లాలో రూ.96 కోట్ల మేర విద్యుత్ ఆదా అయ్యింది. భూగర్భజలాలు పెరగటం మూలంగా హరిత ప్రాంతం పెరిగింది. ఇవన్నీ సానుకూలమైన అంశాలు' అని ముఖ్యమంత్రి అన్నారు.

మిగతా 2లో...

## ఏపీ రాజధానిగా అమరావతి..



- గెజిట్ విడుదల చేసిన కేంద్రం

**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని కేంద్రం ప్రకటించింది. అమరావతికి చట్టబద్ధత కల్పించింది. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపదీముర్ము ఆమోదం తర్వాత కేంద్ర న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 2024 జూన్ 2 నుంచి ఏపీ రాజధానిగా అమరావతిని నోటిఫై చేసినట్లు గెజిట్‌లో పేర్కొంది. ఏపీ అసెంబ్లీ మార్చి 28వ తేదీ చేసిన తీర్మానం మేరకు కేంద్ర ప్రభుత్వం.. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 5(2)ని సవరించి అమరావతిని ఏపీ రాజధానిగా గుర్తించింది. దానిపై ఈనెల 1, 2 తేదీల్లో పార్లమెంటు ఉభయసభల్లో జరిగిన చర్చల్లో 35 మంది సభ్యులు సుమారు 260 నిమిషాలు చర్చించి మూజువాణీ ఓటు ద్వారా ఆమోదముద్రవేశారు. అందులో వైకాపాకు చెందిన ఇద్దరు మినహాయించి మిగిలిన 33 మంది అమరావతికి జై కొట్టారు. పార్లమెంటు ఉభయసభలు ఆమోదించిన బిల్లును కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతి ఆమోదముద్ర కోసం పంపింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 111 కింద తన అధికారాలను అనుసరించి రాష్ట్రపతి ఆమోదం తెలిపారు.

## క్యాన్సర్‌పై పోరు..

### రాష్ట్రానికి చేరిన అదనపు టీకాలు!



- రాష్ట్రానికి అదనంగా చేరిన 1.90 లక్షల డోసుల హెచ్ పీ వీ టీకా
- 3.45 లక్షల్లో ఇప్పటికే 33.19% మంది బాలికలకు వ్యాక్సిన్ పంపిణీ
- మే వరకు కొనసాగనున్న వ్యాక్సిన్ కేంద్రాలు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మరో 1,90,890 డోసుల హెచ్ పీ వీ వ్యాక్సిన్ ను పంపించింది. గర్భాశయ ముఖ ద్వార (సర్వైకల్ క్యాన్సర్) బారి నుంచి తప్పించేందుకు 14-15 ఏళ్ల బాలికల కోసం కేంద్రం తొలివిడత కింద గత నెలలో 1,90,800 డోసుల HPV వ్యాక్సిన్ ను పంపింది.

మిగతా 2లో...

## లక్ష్యం.. ఒకే దేశం - ఒకే ఎన్నిక!

- జమిలి, ఉమ్మడి పౌరస్మృతిపై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు..
- 2029 నుంచి మహిళా రిజర్వేషన్లు అమలు!



**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** భారతీయ జనతా పార్టీ కీలక ఎజెండాలైన ఉమ్మడి పౌర స్మృతి, ఒకే దేశం, ఒకే ఎన్నికలను అమలు చేసే దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దీనిపై చర్చోపచర్చలు జరుగుతున్నాయని, సానుకూల పురోగతి కూడా కనిపిస్తోందని పేర్కొన్నారు. భాజపా 47వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు.

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ల అంశాన్ని 1994లోనే భారతీయ జనతా పార్టీ లేవనెత్తిందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి కట్టుబడి ఉందని తెలిపారు. 2029లో జరిగే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు జరిగే ఎన్నికల్లో ఈ రిజర్వేషన్లు అమలు అయ్యేలా చూస్తామని మోదీ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ హయాంలో ఎమర్జెన్సీ, ప్రతిపక్షాలపై దాడులు వంటి ఎన్నో అణచివేతలను

2లో...

## భారత్ మాతా కీ జై! దేశ రక్షణ అభివృద్ధి బీజేపీ ధ్యేయం



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆవిర్భావానికి 46 సంవత్సరాలు పూర్తై 47వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా వేడుకలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా విజయవాడలో నిర్వహించిన ముఖ్య కార్యక్రమంలో బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పాల్గొని పార్టీ కార్యకర్తలకు, నాయకులకు, దేశ ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

**ఆధ్యాత్మికతతో అనుసంధానం -- 47 సంఖ్య ప్రాధాన్యం :** పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ "47 అనేది సాధారణ సంఖ్య కాదని, ఆధ్యాత్మిక ప్రపంచంలో విశిష్ట స్థానం కలిగిన సంఖ్య" అని పేర్కొన్నారు. కర్మఫలాన్ని ఆశించకుండా కృషి చేసే వారికి ఈ సంఖ్య శుభప్రదమై మార్పు, పరివర్తనకు సంకేతంగా భావిస్తారని వివరించారు. అదే విధంగా భారతీయ జనతా పార్టీ కూడా దేశ చరిత్రలో మార్పుకు నాంది పలికిన శక్తిగా ఎదిగిందని అన్నారు.

**జనసంఘ్ నుండి బీజేపీ వరకు 75 ఏళ్ల ప్రస్థానం :** భారతీయ జనసంఘ్ అక్టోబర్ 21, 1951న స్థాపించబడగా, 1980 ఏప్రిల్ 6న భారతీయ జనతా పార్టీగా రూపుదిద్దుకుందని గుర్తుచేశారు. ఈ 75 ఏళ్ల ప్రయాణంలో దేశ పునర్నిర్మాణం, జాతీయత, సాంస్కృతిక విలువల పరిరక్షణ లక్ష్యాలుగా ఎన్నో ఉద్యమాలు చేపట్టినట్లు వివరించారు.

**చారిత్రక పోరాటాలు - త్యాగాల పునాదిపై పార్టీ ఎదుగుదల :** కాశ్మీర్ సమగ్రత కోసం జరిగిన 'చలో కాశ్మీర్' ఉద్యమంలో పార్టీ స్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చేసిన బలిదానం

మిగతా 2లో...

## నాలుగు రాష్ట్రాలకు వరం.. మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు !

- మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు పనులు 70 శాతం పూర్తి
- రాష్ట్రానికి అందుబాటులో ఉన్న రాష్ట్రాలకు మూలపేట పోర్టు ఒక వరలాంటిది
- కేంద్రం నుండి 390 ఎకరాలు ఉప్పు భూములు లీజుకు



**శ్రీకాకుళం(జర్నలిస్ట్ ఫైల్) :** గత ప్రభుత్వ హయాంలో మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు పనులు కేవలం 20 శాతం మాత్రమే చేపట్టినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 70 శాతం వరకు పనులు పూర్తి చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారు స్పష్టం చేశారు. పోర్ట్ కు రవాణా సదుపాయం ముఖ్యమని, అందుకు సంబంధించి ఉప్పు భూములు అవసరమని, ఉప్పు భూములు కోసం కేంద్ర ప్రభుత్వానికి ఒక్క లేఖ పంపలేదన్నారు. పోర్టుకు ఉప్పు భూములు 400 ఎకరాలు అవసరమైతే 399 ఎకరాలు భూములు 99 సంవత్సరాలకు లీజుకు ఇచ్చినట్లు వెల్లడించారు. అక్కడ అటవీ శాఖ భూములు ఉన్నాయని, వాటిని తీసుకొని అటవీ శాఖ కు

మిగతా 3లో...

## 16 వేల గ్రామాల్లో బీజేపీ 'మన ఊరు - మన జెండా'



- మోతడక గ్రామంలో "మన ఊరు - మన జెండా" కార్యక్రమానికి శ్రీకారం
- జెండా దిమ్మలపై క్యూఆర్ కోడ్ ఏర్పాటుతో అభివృద్ధి కార్యక్రమాలపై ప్రచారం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం గుంటూరు జిల్లా తాడికొండ మండలం మోతడక గ్రామంలో ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ తాడికొండ మండల అధ్యక్షులు బండ్ల అశోక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

మిగతా 3లో...

## కూటమి సర్కార్ 'స్మార్ట్' కానుక..



- గ్రామసంఘ సహాయకుల సేవలు సమర్థవంతంగా అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- విజయవాడలో అట్టహాసంగా వీఓఏలకు స్మార్ట్‌ఫోన్ల పంపిణీ
- 28 జిల్లాల నుంచి భారీ ఎత్తున హాజరైన వీఓఏలు
- 28,500 స్మార్ట్ ఫోన్ల పంపిణీ.. రు. 10 లక్షల బీమాపై సీఎంతో చర్చిస్తా అన్న మంత్రి

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** గ్రామస్థాయిలో గ్రామ సంఘ సహాయకుల సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు, డిజిటల్ కమ్యూనికేషన్‌ను బలోపేతం చేయడమే లక్ష్యంగా స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. సోమవారం విజయవాడ రామవరప్పాడు ఎం కన్వెన్షన్‌లో గ్రామ సంఘ సహాయకులకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా 28 జిల్లాల నుంచి భారీ ఎత్తున వీఏవోస్ ఈ కార్యక్రమానికి తరలివచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కొండపల్లి మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

మిగతా 2లో...

## ప్రతి నీటి చుక్కా అమూల్యమే..

- రాష్ట్రమంతా వర్షపు నీటి సంరక్షణకు 100 రోజులు కార్యాచరణ ప్రణాళికలు అమలకు శ్రీకారం
- ప్రతి నీటి చుక్కను సంరక్షించడం, భూగర్భ జలాలు స్థాయిని పెంచే బాధ్యత మనందరిపై ఉంది
- "నీటి భద్రత - సాగునీటి సంఘాలు బాధ్యత" కార్యక్రమానికి శ్రీకారం.
- రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి



**ఏలూరు (జర్నలిస్ట్ ఫైల్) :** నూజివీడు పట్టణంలోని పెద్ద చెరువు వద్ద సోమవారం "నీటి భద్రత – సాగునీటి సంఘాలు బాధ్యత" కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

మిగతా 2లో...

## నీటి రక్షణతో సర్వతోముఖాభివృద్ధి

- కలెక్టర్లు జలధార కార్యక్రమాన్ని సవాల్‌గా తీసుకోవాలి
- 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలుకు ఉపాధి హామీ నిధులను ఇంటిగ్రేట్ చేయాలి
- జలధారతో భూమికి జలహారతి కార్యక్రమంపై జిల్లా కలెక్టర్లతో సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** జలధార-జలహారతి కార్యక్రమాన్ని అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లాల యంత్రాంగం అత్యంత ప్రాధాన్యతాంశంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. సోమవారం తాడిపత్రిలో జలధార-జలహారతి కార్యక్రమాన్ని ముగించుకుని అమరావతికి చేరుకోగానే క్యాంప్ కార్యాలయంలో జలధార కార్యక్రమం అమలుపై అధికారులతో సమీక్షించారు. జిల్లాల కలెక్టర్ల సహా జిల్లాల్లోని వివిధ శాఖల అధికారులతో

2లో...

# క్యాన్సర్‌పై పోరు..



(మొదటి పేజీ తరువాయి)

ఇందుకు అదనంగా మరో 1,90,890 డోసుల వ్యాక్సిన్ ను కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి పంపించినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారం ఓ పత్రికా ప్రకటనలో వెల్లడించారు. ఈ వ్యాక్సిన్ ను సదరు జిల్లాల్లోని బాలికల సంఖ్యకు అనుగుణంగా పంపించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని వెల్లడించారు. వచ్చే మే నెల వరకు బాలికలకు నిరాటకంగా వ్యాక్సిన్ పంపిణీ జరుగుతుంది. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ముగిసినందున వ్యాక్సిన్ పంపిణీలో మరింత వేగం పెరుగుతుంది.

**ఇప్పటికే 1.14 లక్షల మందికి వ్యాక్సిన్ పంపిణీ :** గ్రామ/వార్డు సచివాలయాల్లో రికార్డుల ఆధారంగా 14 ఏళ్లు పూర్తి చేసుకుని 15 ఏళ్లు దాటని బాలికలు రాష్ట్ర వ్యాప్తంగా 3.45 లక్షల మంది ఉన్నారు. వీరిలో సోమవారం మధ్యాహ్నం వరకు 1,14,512(33.19%)మంది బాలికలకు వ్యాక్సిన్ ఇచ్చారు. అత్యధికంగా కర్నూలు జిల్లా-6,785, నెల్లూరు జిల్లాలో 6,726, వైఎస్సార్-6,725, అనంతపురం జిల్లాలో 6,655 మంది బాలికలకు చొప్పున వ్యాక్సిన్ పంపిణీ జరిగింది తక్కువగా పోలవరం జిల్లా-669, అల్లూరి సీతారామరాజు-1,063, శ్రీ సత్యసాయి-2,769, అనకాపల్లి జిల్లాలో 2,959 మందికి చొప్పున వ్యాక్సిన్ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికీ వాక్సిన్ పంపిణీ నిరాటకంగా కొనసాగుతోంది. రాష్ట్రంలో కోల్డ్ చైన్ (వ్యాక్సిన్ భద్రపరిచే) సౌకర్యం ఉన్నట్లు గుర్తించిన ప్రాథమిక ఆరోగ్య, పట్టణ ఆరోగ్య కేంద్రా(1,645)ల్లో వ్యాక్సిన్ అందిస్తున్నారు. టీకా ఇచ్చిన అనంతరం బాలికలను 30 నిమిషాలపాటు అక్కడే ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటివరకు ఎటువంటి రియాక్షన్ కేసెస్ నమోదు కాలేదని అధికారులు తెలిపారు.

**మొత్తం 3.81లక్షల డోసుల వాక్సిన్ రాక :** కేంద్ర మార్గదర్శకాలు అనుసరించి బాలికలకు వ్యాక్సిన్ పంపిణీ చేయడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందంజలో ఉంది. గర్భాశయ ముఖ క్యాన్సర్ను నివారించడంలో హెచ్పి వ్యాక్సిన్ కీలక పాత్ర పోషిస్తోంది ఈ హెచ్పీవీ టీకా సురక్షితమైనది. ప్రభావవంతమైంది. రెండు విడతలుగా కలిపి రాష్ట్రానికి కేంద్రం నుంచి 3,81,780 డోసుల టీకా వచ్చింది. మరోవైపు..కేంద్రశీనుంచి వచ్చిన ఆదేశాల మేరకు తొలి విడతలో వచ్చిన వాక్సిన్ లో 500 డోసులను యానాశీకు అధికారులు పంపించారు.

# లక్ష్యం.. ఒకే దేశం - ఒకే ఎన్నిక!



(మొదటి పేజీ తరువాయి)

భాజపా కార్యకర్తలు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉత్సాహపరిచేలా పలు అంశాలను పేర్కొన్నారు.

"మన కార్యక్రమం చురుగ్గా ముందుకెళుతోంది. ఉమ్మడి పౌరస్మృతి, జమిలి ఎన్నికలపై తీవ్రంగా చర్చలు జరుగుతున్నాయి. మంచి పురోగతి కనిపిస్తోంది. అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి భాజపా కట్టుబడి ఉంది. బ్రిటీష్ కాలం నాటి చట్టాలను రద్దు చేశాం. కొత్త పార్లమెంట్ భవనాన్ని నిర్మించుకున్నాం. జనరల్ కేటగిరీలో 10 శాతం రిజర్వేషన్లు, ట్రిపుల్ తలాక్ రద్దు, పౌరసత్వ సవరణ చట్టం, అయోధ్యలో రామ మందిర నిర్మాణం వంటివి చేపట్టాం" అని ప్రధాని మోదీ అన్నారు. 'ఆర్టికల్ 370 రద్దు అసాధ్యమని చాలా మంది వాదించారని, కానీ దాన్ని రద్దు చేసి చూపించామని ప్రధాని మోదీ అన్నారు. ప్రజల కోసం, జాతి ప్రయోజనాల కోసం ఈ కూటమి పనిచేస్తోందన్నారు.

# ప్రతి నీటి చుక్కా అమూల్యమే..



(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనల మేరకు రాష్ట్రంలో భూగర్భ జలాలు మట్టాన్ని పెంపొందించడం, నీటి వనరులు సంరక్షణ, సాగునీటి వ్యవస్థ బలోపేతం లక్ష్యంగా "నీటి భద్రత - సాగునీటి సంఘాల బాధ్యత" పేరుతో వంద రోజుల ప్రత్యేక కార్యక్రమం దృష్ట్యా ప్రత్యేక పూజలు నిర్వహించి, కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అధికారులకు, సాగునీటి సంఘాలు అధ్యక్షులు, డైరెక్టర్లు, రైతులు సంఘ నాయకులు, రైతులతో సుదీర్ఘంగా సమీక్షించి మంత్రి కొలుసు పార్థసారథి పలుసూచనలు జారీ చేశారు.


ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ప్రతి నీటి చుక్కను సంరక్షించడం భూగర్భ జలాలు స్థాయిని పెంచడం మనందరి బాధ్యత అన్నారు. నీటి వృథాను నివారించడం సమర్థ వంతమైన వినియోగాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. నూజివీడు నియోజకవర్గం 4 మండలాలో యంఐ ట్యాంకులు 68, పంచాయతీరాజ్ ట్యాంకులు 300 ఉన్నాయని తెలిపారు. కెపాసిటీ ఇన్ యంసియఫ్టి 4,117.852 , రిజిస్ట్రేషన్ ఆయకట్టు 25,947.09 ఎకరాలు ఉందని తెలిపారు. ఈ క్రమంలో ఏప్రిల్ 6 నుండి జూలై 14 వరకు 100 రోజులు కార్యాచరణ ప్రణాళిక అమలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని సాగునీటి కాలువలు, చెరువులు, జలాశయాలను పునరుద్ధరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. సాగునీటి కాలువలు, చెరువులు గట్లను బలోపేతం చేయడం, కాలువల పూడికతీత, లాక్స్ మరమ్మతులు వంటి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనుల్లో ప్రజలు భాగస్వామ్యం ఉంటేనే పనులు వేగవంతంగా, నాణ్యతగా జరుగుతాయని అన్నారు. జలవనరులు శాఖ, అటవీ శాఖ, పంచాయతీ రాజ్, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖలు, డ్వామా తదితర శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమం అమలు చేయబడుతుందని తెలిపారు. కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 6-15 పనులు గుర్తింపు, కాలువల శుభ్రపరచడం, పూడికతీత పనులు జరుగుతాయని అన్నారు. ఏప్రిల్ 16--20 పరిపాలనా అనుమతులు, ఏప్రిల్ 21-జూలై 9 పనుల అమలు జూలై 10-14 తుది నివేదిక సమర్పణ ఉంటుందన్నారు. ప్రజలు భాగస్వామ్యంతో నాణ్యమైన పనులు చేపట్టి, సాగునీరు శివారు భూములు వరకు చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాలువలు, బోదుల ఆక్రమణలను తొలగించే దిశగా కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు మేరకు పనులను సకాలంలో పూర్తి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, వివిధ శాఖలు అధికారులు, నీటి సంఘాలు అధ్యక్షులు, డైరెక్టర్లు, రైతులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# జల సంరక్షణ..100 రోజుల యాక్షన్ ప్లాన్!

(మొదటి పేజీ తరువాయి)

**రబీ, ఖరీఫ్‌కు సమృద్ధిగా నీరు :** వర్షాకాలం కంటే ముందు 6 మీటర్ల లోతున, ఆ తర్వాత 3 మీటర్ల కంటే తక్కువగా భూగర్భ జలాలు అందుబాటులో ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి అన్నారు. తద్వారా రాష్ట్రంలో నీటి ఎద్దడి లేకుండా చేయవచ్చని అన్నారు. "రిజర్వాయర్లలో నీళ్లు నిండుగా ఉంటే ఎప్పటికప్పుడు మనం వినియోగించుకునే అవకాశం ఉంటుంది. శ్రీశైలం నీటిని వేర్వేరు చోట్ల ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేసి నీరు తెచ్చుకుంటున్నాం. రాష్ట్రంలోనూ, రాయలసీమలోనూ ప్రతీ ఎకరాకూ నీరు ఇచ్చే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. రాష్ట్రవ్యాప్తంగా ఒక్క ఖరీఫ్‌కు 547 టీఎంసీలు, రబీకి 343 టీఎంసీలు, పరిశ్రమలకు 28, తాగునీటికి 158 టీఎంసీల నీరు అవసరం అవుతుంది. మొత్తంగా 1300 టీఎంసీల వరకూ నీటి అవసరం ఉంటుంది. ఈ ఏడాదిలో 74 టీఎంసీల నీరు అనంతపురం వరకూ తీసుకువచ్చాం. హంద్రీనీవా ద్వారా చిట్టచివరి భూములకు కూడా నీరు తీసుకెళ్లాం. పట్టిసీమ నుంచి కృష్ణా డెల్టాకు తీసుకువచ్చి రబీకి, ఖరీఫ్‌కు ఇచ్చే నీటిని ఆదా చేసి శ్రీశైలం నుంచి రాయలసీమకు తరలించాం. భూమినే జలాశయంగా మార్చుకుని వినియోగించు కోవటం ద్వారా మెరుగైన నీటి నిర్వహణ చేపట్టవచ్చు. రబీ, ఖరీఫ్ పంటలు పూర్తి అయ్యాక కూడా ప్రస్తుతం మన రిజర్వాయర్లలో 65 శాతం నీటి నిల్వ ఉంది. దేశంలోనే అతితక్కువ వర్షపాతం పడే అనంతపురం జిల్లా కూటమి ప్రభుత్వం చూపిన చొరవ కారణంగా ఎక్కువ పండ్ల తోటలతో సంపన్నమైన ప్రాంతంగా మారిందని అన్నారు. గత పాలకులు విద్యుత్ ఛార్జీలు పెంచారని, రూ. 1.24 లక్షల కోట్ల మేర అప్పులు చేశారని అన్నారు. కూటమి వచ్చాక గత ప్రభుత్వం పెంచిన సుమారుగా రూ. 4,400 కోట్ల భారాన్ని కూడా ప్రజలపై వేయకుండా ప్రభుత్వమే భరిస్తోందని తెలిపారు. అలాగే తొలిసారి విద్యుత్ ఛార్జీల ట్రూ డౌన్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.



**పిచ్చి ముదిరి మావిగన్ మాటలు :** గత పాలకులు రాష్ట్ర ప్రజలకు అడ్రస్ లేకుండా చేశారని, ఇప్పుడు మీ రాజధాని ఏదంటే అమరావతి అని గర్వంగా చెప్పే రోజు వచ్చిందని సీఎం వ్యాఖ్యానించారు. 'గతంలో మూడు ముక్కలాట ఆడారు. ఇక మనకు ఒక్కటే రాజధాని నగరం. పార్లమెంటులో 50 పార్టీలు ఉంటే అందులో వైసీపీ మినహా 49 పార్టీలు అమరావతికి మద్దతు పలికారు. ఒక్క దిక్కుమాలిన వైసీపీ మాత్రమే రాష్ట్రానికి ద్రోహం చేసింది. పిచ్చి ముదిరి మావిగన్ అంటూ కొత్తపేరు తీసుకొచ్చారు. అమరావతి అని పలకడానికి కూడా ఇష్టం లేని వ్యక్తులు మావిగన్ అంటున్నారు. బాబాయిని చంపి నా చేతిలో కత్తి పెట్టిన వాళ్లు ఎలాంటి రాజకీయమైనా చేస్తారు. అమరావతి పనులు వేగంగా జరుగుతుంటే.. చూసి సహించలేక ఫ్రస్టేషన్‌తో అవినీతి జరిగిందని అంటున్నారు. 2047 నాటికి ఏపీని అగ్రస్థానంలోకి తీసుకెళ్లే బాధ్యత తీసుకున్నాం. దీనికి ప్రణాళికలు కూడా సిద్ధం చేశాం. ఉత్తరాంధ్ర నుంచి పశ్చిమ గోదావరి వరకూ విశాఖ, ప్రకాశం- నెల్లూరు వరకూ అమరావతి, తిరుపతి కేంద్రంగా రాయలసీమ ప్రాంతాల్లో అభివృద్ధి రీజియన్లుగా తయారవుతాయి' అని ఆశాభావం వ్యక్తం చేశారు.

**పెట్టుబడులు వస్తుంటే ఓర్చుకోలేకపోతున్నారు :** గత పాలకులు రాష్ట్రంపై పగపట్టారని, రాష్ట్రానికి పెట్టుబడులు, యువతకు ఉద్యోగాలు వస్తుంటే ఓర్వలేకపోతున్నారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రతీ జిల్లాను అభివృద్ధి చేస్తున్నాం. ఆడబిడ్డల జోలికి వస్తే వారికి అదే చివరి రోజు అవుతుంది. ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యత ప్రభుత్వానిదే. దేవాలయాలపై దాడులు చేసి తిరిగి ఎదురు దాడి చేస్తున్నారు. తిరుమలలో శ్రీవారి ప్రసాదం నాణ్యతను దెబ్బతీశారు. కల్తీ నెయ్యితో ఘోర అపచారం చేశారు. రాష్ట్రంపై విద్వేషం చూపించే వారికి సహకరిస్తే పౌరులందరికీ నష్టం కలుగుతుంది. పెట్టుబడులు తీసుకువస్తుంటే వారిని బెదిరిస్తున్నారు. ఇలాంటి వారిని దూరం పెట్టాలి. కరెంటు, నీరు లాంటి దీర్ఘకాలిక సమస్యలను క్రమంగా పరిష్కరించుకుందాం. అందరికీ సమర్థవంతమైన, జవాబుదారీ పాలన ఇవ్వాలన్నదే మా లక్ష్యం. రాష్ట్రమే నా కుటుంబం. అందరికీ న్యాయం చేసే బాధ్యత మాది. ఆర్థిక కష్టాలు ఉన్నప్పటికీ సూపర్ సిక్స్ పథకాల ద్వారా చేయూత అందిస్తున్నాం. పెట్టుబడులు వస్తే.. ఆదాయం వస్తుంది అప్పుడే సంక్షేమం చేయగలం. సుపరిపాలనకు ప్రజలంతా సహకరించాలని' చంద్రబాబు విజ్ఞప్తి చేస్తున్నాను.

**ప్రజల ముందే ప్రజంటేషన్ :** అనంతపురం జిల్లా, తాడిపత్రి పర్యటన సందర్భంగా నియోజకవర్గ ప్రోగ్రెస్ రిపోర్ట్‌ను యాడికి జలధార సభలో ముఖ్యమంత్రి చదవి వినిపించారు. వివిధ శాఖల పనితీరు నివేదికలను ప్రజల ముందు ప్రజెంట్ చేశారు. సరిగ్గా పనితీరు కనబరచని వివిధ శాఖలకు చెందిన అధికారులను వేదికపైకి పిలిపించి వివరణ అడిగారు. పనితీరును మెరుగు పర్చుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. అధికారులకు పూర్తిగా సహకరిస్తామని... అధికారులు, ఉద్యోగులు కూడా రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరారు. భూవివాదాలనేవి లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారులకు స్పష్టం చేశారు. ట్రాక్టర్లల్లో ఇసుక తీసుకెళ్తున్నప్పుడు ఎవరైనా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారా..? అని ప్రజలనే నేరుగా సభలో సీఎం అడగ్గా... ఎవ్వరూ అడ్డుకోవడం లేదని ప్రజలు బదులిచ్చారు. దీనికి సీఎం స్పందిస్తూ...ఆదాయం తగ్గినా పర్వాలేదనుకుని ఉచిత ఇసుక విధానం అమలు చేస్తున్నామన్నారు. బాగా పని చేసిన అధికారును అభినందించాలంటూ ప్రజలతోనే సభలో చప్పట్లు కొట్టించారు. ఉద్యోగుల పనితీరు ఆధారంగా సూపర్ అచీవర్స్.. అచీవర్స్.. పెర్ఫార్మర్స్.. లెర్నర్స్ గా విభజిస్తున్నట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. కొందరు అధికారులు గైర్హాజరు కావడంతో...ఇకపై తాను వచ్చే ప్రతీ సభకు జిల్లా అధికార యంత్రాంగం మొత్తం హాజరవ్వాలని ఆదేశించారు.

**జై అమరావతి అంటూ నినాదాలు :** ముఖ్యమంత్రి చంద్రబాబు జలధార కార్యక్రమంలో ప్రజావేదిక సభకు వచ్చేముందు ప్రజలు జై అమరావతి అంటూ నినాదాలు చేశారు. రాజధాని అమరావతికి పార్లమెంట్ చట్టబద్ధత కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. స్వయంగా అమరావతి లోగో పట్టుకుని సభకు జేసీ ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. యాడికిలో సీఎం హెలిక్యాప్టర్ దిగాక అమరావతి బ్యాడ్జిని అందించారు. సభలో రాజధానికి చట్టబద్ధతపై హర్షం వ్యక్తం చేస్తూ ప్లకార్డులు, జెండాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ...రాష్ట్రానికి ద్రోహం చేసిన పార్టీ వైసీపీ అని వ్యాఖ్యానించారు. వైసీపీ ఓ దిక్కుమాలిన పార్టీ అంటూ ఘాటుగా విమర్శించారు. రాష్ట్రం మీద పగ పట్టినట్టు వైసీపీ వ్యవహరిస్తోందన్నారు. ఫ్యాక్షనిస్టులు, ముఠా నాయకుల కంటే ఘోరంగా రాష్ట్రాభివృద్ధిని వైసీపీ అడ్డుకుంటోందని దుయ్యబట్టారు. సభ అనంతరం పార్లమెంటులో అమరావతికి చట్టబద్ధత ఆమోదానికి గుర్తుగా సీఎంకు అమరావతి జ్ఞాపికను జేసీ పవన్ రెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్, స్థానిక ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి, ఎంపీలు, జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు తన ప్రసంగానికి ముందు ప్రజావేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. నీటి సంరక్షణకు అనంతపురం జిల్లా, నియోజకవర్గంలో చేపట్టిన చర్యలను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి వివరించారు. 100 రోజుల యాక్షన్ ప్లాన్‌కు సంబంధించిన వివరాలను ఫొటో ఎగ్జిబిషనులో అధికారులు ప్రదర్శించారు. డ్వాక్రా, స్థానిక మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల స్టాల్‌ను, గ్రానైట్, డొలమైట్, సున్నపురాయి గనులకు సంబంధించిన స్టాల్ ను సందర్శించారు. హార్టికల్చర్ ఉత్పత్తులను కూడా సీఎం చంద్రబాబు పరిశీలించారు.

# కూటమి సర్కార్ 'స్మార్ట్' కానుక..



(మొదటి పేజీ తరువాయి)

డ్వాక్రా సంఘాలు ప్రారంభించారని.. ఈ సంఘాలతో ఈ రోజు రాష్ట్రంలో మహిళా నాయకత్వ స్ఫూర్తి ప్రతి గ్రామంలోనూ ప్రజ్వరిల్లుతోందన్నారు. సెర్ఫ్ సీఈవో కరుణ గారితో పాటు జిల్లా స్థాయిల్లో ఉన్నతాధికారులు అందరూ మహిళాభ్యున్నత కోసం ఎంతో శ్రమిస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 28,500 గ్రామ సంఘ సహాయకులకు ఈ రోజు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేయడంతో వాళ్ల ఆనందాన్ని చూస్తుంటే తనకు ఎంతో ఉత్సాహం వేస్తోందన్నారు. 2016లో, ఇప్పుడు 10 ఏళ్ల తర్వాత కూడా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే స్మార్ట్‌ఫోన్లు ఇస్తున్నారని.. చంద్రబాబుకు వీవోఏల పట్ల ఎంత ప్రేమ ఉందో చెప్పేందుకు నిదర్శనమన్నారు. 6 GM ర్యామ్, 128 GB స్టోరేజ్, 5G లాంటి అద్భుతమైన ఫీచర్లతో మీకు ఈ ఫోన్లు అందిస్తున్నామని మంత్రి చెప్పారు. తనకు హోం మినిస్టర్ కన్నా ఎక్కువ ప్రొటోకాల్ ఉందని.. ప్రతి గ్రామంలోనూ సంఘ సభ్యులు ఉంటారని... వీరందరికి తాను అతిథినే అని.. ఏ ఇంట్లో అయినా తాను భోజనం చేసే స్వేచ్ఛ ఉందని మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏం చేస్తే ప్రజల మెప్పు పొందుతామో.. ఏం చేస్తే ప్రజల కళ్లల్లో ఆనందం చూస్తామో తెలియాలంటే ఖచ్చితంగా సెర్ఫ్‌లో పని చేయాలన్నారు. సంఘ సహాయకులకు రు. 10 లక్షల ప్రమాద బీమా అంశం ముఖ్యమంత్రి గారితో చర్చించి అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం ఎన్నో పథకాలు తీసుకువస్తున్నా.. వాటి గురించి మహిళలు పూర్తిగా తెలుసుకోలేకపోతున్నారని మంత్రి పేర్కొన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలన్నదే చంద్రబాబు గారి ఆలోచన అని అందుకు అనుగుణంగా ఎంఎస్ఎంఈ శాఖ పని చేస్తోందన్నారు. గ్రామాల్లో మహిళలు చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఎంఎస్ఎంఈ శాఖ తోడ్పాటునందిస్తోందని మంత్రి తెలిపారు. ఫేక్‌గ్రూప్‌లపై ఎప్పుడూ నిఘా ఉంటుందని చెప్పిన మంత్రి.. ప్రతి నియోజకవర్గంలోనూ ఒక ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సెర్ఫ్ సీఈవో వాకాటి కరుణ, అదనపు సీఈవో ఆర్. శ్రీరాములు నాయుడు, డైరెక్టర్ అడ్మిన్ ఎ. కల్యాణ చక్రవర్తి, శ్రీ నిధి మేనేజింగ్ డైరెక్టర్ హరిప్రసాద్, డైరెక్టర్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి రక్షణతో సర్వతోముఖాభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా జలధార కార్యక్రమం జరిగిన తీరుపై సీఎం ఆరా తీశారు. శ్రీకాకుళం జిల్లాలో సాగునీటి సంఘాల సభ్యులు భాగస్వామ్యం బాగుందని సీఎంకు అధికారులు వివరించారు. కార్యక్రమం మొదలు పెట్టిన తొలి రోజునే నంద్యాల, పశ్చిమ గోదావరి జిల్లాలు 100 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయడంపై ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. నీటి సంరక్షణలో ఇప్పటికే తాను చేపట్టిన చర్యలను అన్నమయ్య జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సులో వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."అన్నమయ్య జిల్లా కలెక్టర్ జలధార పేరుతో అద్భుతంగా నీటి సంరక్షణ చర్యలు చేపట్టారు. అన్నమయ్య కలెక్టర్ తీసుకున్న చొరవతో 8.59 మీటర్ల మేర భూగర్భ జలాలు పెరిగాయి. 20 వేల బోర్లు రీ-ఛార్జ్ అయ్యాయి. ప్రతీ జిల్లా కూడా అన్నమయ్య జిల్లా మోడల్ ఫాలో కావాలి. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తే... కచ్చితంగా మార్పు కన్పిస్తుంది. సత్ఫలితాలు వస్తాయి. నీటి సంరక్షణతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందని నిరూపించాలి. ఈ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మలిచేందుకు.. వారి భాగస్వామ్యం ఉండేలా సాగునీటి సంఘాల సభ్యులు బాధ్యత తీసుకోవాలి."అని సీఎం సూచించారు.

**జిల్లా కలెక్టర్లే టీమ్ లీడర్లు :** "జలధారతో జలహారతి కార్యక్రమానికి ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేసుకోవాలి. వీలైనంత వరకు నిధుల కొరత రానీయకుండా చూస్తాం. ఈ కార్యక్రమంలో నిధుల కంటే చిత్తశుద్ధి ముఖ్యం. ఈ కార్యక్రమాన్ని సక్సెస్ చేయడాన్ని జిల్లా కలెక్టర్లు బిగ్ ఛాలెంజ్ గా తీసుకోవాలి. టీమ్ లీడర్లుగా కలెక్టర్లు వ్యవహరించి అందర్నీ భాగస్వాములను చేయాలి. ప్రజా భాగస్వామ్యంతోనే జలహారతి కార్యక్రమం సక్సెస్ అవుతుంది. కలెక్టర్లు ఏ మేరకు చొరవ తీసుకుంటున్నారనేది ఈ కార్యక్రమంతో క్లారిటీ వస్తుంది. జలధార కార్యక్రమంలో చెరువులు చాలా కీలకం. ప్రతి చెరువునూ నింపాలి. మైనర్ బేసిన్లు, సబ్ బేసిన్లు, క్యాస్కేడ్లు, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు ఎన్ని ఉన్నాయో చూడాలి.. వాటికి నీటి సౌకర్యం కల్పించాలి.. వాటి సోర్సెస్ నుంచి నీరు రాకుంటే... దానికి కారణాలు వెలికి తీయాలి. ప్రతి చెరువును నింపాలి.. భూగర్భ జలాలను పెంచాలి. ప్రతి కాల్వను బాగు చేయాలి. గుర్రపు డెక్క, సిల్ట్ తొలగింపు వంటి అంశాలపై ఫోకస్ పెట్టాలి. ఇది జరిగితే వర్షాకాలంలో ముంపు బాధ తప్పుతుంది. ఇదే లక్ష్యంతో కలెక్టర్లు కార్యాచరణను సిద్ధం చేయాలి. నీటి రక్షణతో వ్యవసాయం మెరుగవుతుంది. విద్యుత్ ఆదా అవుతుంది. స్వర్ణాంధ్ర పది సూత్రాలు కూడా నీటి సంరక్షణ చర్యలతో సక్సెస్ చేయవచ్చు. జిల్లాల జీఎస్డీపీ, రాష్ట్ర జీడీపీ పెరగడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుంది."అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో సీఎస్ సాయి ప్రసాద్, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# భారత్ మాతా కీ జై! దేశ రక్షణ - అభివృద్ధి బీజేపీ ధ్యేయం

(మొదటి పేజీ తరువాయి)

దేశ చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. అనంతరం పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజపేయి వంటి మహానేతలు పార్టీని దేశవ్యాప్తంగా విస్తరించారని తెలిపారు.

గోవా విముక్తి ఉద్యమం, 1962 చైనా యుద్ధం, 1965 పాకిస్థాన్ యుద్ధ సమయంలో పార్టీ కార్యకర్తలు సేవా కార్యక్రమాలతో దేశానికి అండగా నిలిచిన విషయాన్ని గుర్తుచేశారు.

**ఎమర్జెన్సీ - ప్రజాస్వామ్య రక్షణలో కీలక పాత్ర :** 1975లో విధించిన అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) సమయంలో జనసంఘ్ కార్యకర్తలు 19 నెలల పాటు నిరంతర పోరాటం చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడారని తెలిపారు. వేలాది మంది జైళ్లలో ఉండి, మరెందరో అజ్ఞాతవాసంలో పోరాడి దేశానికి మరో స్వాతంత్ర్య పోరాటాన్ని అందించారని పేర్కొన్నారు.

**వాజపేయి యుగం - శక్తివంతమైన భారత్‌కు పునాది :** అటల్ బిహారీ వాజపేయి నాయకత్వంలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి పోఖ్రాన్ అణు పరీక్షలు, కార్గిల్ యుద్ధంలో విజయం, లాహోర్ బస్సు యాత్ర వంటి కీలక నిర్ణయాలతో దేశాన్ని శక్తివంతమైన దిశగా నడిపిందని చెప్పారు. సుపరిపాలనకు వాజపేయి ప్రతీకగా నిలిచారని కొనియాడారు.

**మోదీ యుగం - అభివృద్ధి, దౌత్య, భద్రతలో కొత్త దశ :** నరేంద్ర మోదీ నాయకత్వంలో 2014లో బీజేపీ పూర్తి మెజారిటీతో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసి దేశానికి







కొత్త దిశ చూపిందని అన్నారు. ఆర్టికల్ 370 రద్దు, అ-యోధ్యలో రామమందిర నిర్మాణం, సంక్షేమ పథకాల విస్తరణ, గ్రామీణ అభివృద్ధి, డిజిటల్ భారత్ వంటి కార్యక్రమాలతో దేశం వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు.

దేశ భద్రత పరంగా యూరి, పుల్వామా ఘటనల తర్వాత సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్ స్ట్రైక్స్ నిర్వహించి ప్రపంచానికి భారతదేశ ధైర్యాన్ని చాటిందని చెప్పారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ ప్రతిష్ఠ మరింత పెరిగిందని, ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా, రష్యా వంటి దేశాలతో సమతుల్య దౌత్య సంబంధాలు కొనసాగుతున్నాయని తెలిపారు.

**వికసిత భారత్ లక్ష్యం -- 2047 దిశగా అడుగులు :** "ఆజాదీ కా అమృత్ కాల్" నేపథ్యంలో 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. "సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్" అనే నినాదంతో ప్రతి పౌరుడు అభివృద్ధిలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.

**ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ బలోపేతం :** ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీని గ్రామస్థాయికి విస్తరించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. "మన ఇల్లు - మన జెండా" కార్యక్రమం ద్వారా ప్రతి కార్యకర్త తన ఇంటిపై పార్టీ జెండా ఎగురవేసి, ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కూటమి ప్రభుత్వంలో పార్టీ పాత్రను మరింత బలపరచి ప్రజల ఆశయాలకు అనుగుణంగా పని చేస్తామని చెప్పారు.

**దేశ నిర్మాణం, సమాజ అభ్యున్నతే లక్ష్యం :** "రాజకీయం మాకు వృత్తి కాదు, అది ఒక మిషన్" అని పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. దేశ నిర్మాణం, సమాజ అభ్యున్నతి లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, దీన్ దయాళ్ ఉపాధ్యాయ వంటి మహానేతల త్యాగాలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తి కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్టా ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి, రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జ్ ఉప్పలపాటి శ్రీనివాసరాజు, కిసాన్ మోర్చా అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి, ఎస్సీ మోర్చా అధ్యక్షులు పనతాల సురేష్,, మైనారిటీ మోర్చా అధ్యక్షులు సయ్యద్ బాషా, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వస్త్ర బహూకరణ వేడుకలో పాల్గొన్న మంత్రి నారా లోకేష్



విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) : ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్ కుమారుడు, కుమార్తె నూతన వస్త్ర బహూకరణ వేడుకకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. విజయవాడ పున్నమి ఘాట్ లో జరిగిన నూతన వస్త్ర బహూకరణ మహోత్సవంలో పాల్గొని డూండి రాకేష్ కుమారుడు సాయి సీతారామ్, కుమార్తె లక్ష్మీ కుసుమ కుమారిలను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ పరిధిలోకి పిఠాపురం రైల్వే స్టేషన్



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్ర ఉపముఖ్య మంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ కృషితో పిఠాపురం రైల్వే స్టేషన్ సకల సౌకర్యాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు కానుంది. పిఠాపురం స్టేషన్ ను అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద అభివృద్ధి చేయాలని ఆయన చేసిన ప్రతిపాదనలకు కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ ఆమోదం తెలిపింది. రూ. 37.25 కోట్లతో స్టేషన్ లో మౌలిక వసతులు అభివృద్ధి చేయనుంది. గత పిఠాపురం పర్యటనలో పవన్ కళ్యాణ్ క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లిన సందర్భంలో రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు అశుభ్రత, దుర్గంధం వెదజల్లుతుండడాన్ని చూశారు. రైల్వే స్టేషన్ పరిసరాలను తక్షణం శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. జనవరి నెలలో జరిగిన ఢిల్లీ పర్యటనలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ గారితో సమావేశం సందర్భంగా పిఠాపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా చర్చించారు. ఆధ్యాత్మికంగా ముఖ్య పట్టణమైన పిఠాపురంలోని రైల్వే స్టేషన్ కి దూర ప్రాంతాల నుంచి యాత్రికులు వస్తారని, వారి సౌకర్యార్థం అమృత్ భారత్ పథకం కింద అభివృద్ధి చేయాలని కోరారు.

పవన్ కళ్యాణ్ అభ్యర్థన పట్ల సానుకూలంగా స్పందించిన కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ పిఠాపురం స్టేషన్ ను అమృత్ భారత్ స్టేషన్ గా అభివృద్ధి చేసేందుకు ముందుకు వచ్చింది. స్టేషన్ భవనం, ముఖద్వారంతోపాటు దివ్యాంగుల కోసం ప్రత్యేక సౌకర్యాలతో కూడిన విశ్రాంతిగది నిర్మాణం, అత్యాధునిక టాయిలెట్లు, డ్రైనేజీ వ్యవస్థ, కేబులింగ్, ప్లాట్ ఫారం అభివృద్ధి, షెల్టర్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనులు చేపట్టనుంది.


## నీటి సంరక్షణే భవిష్యత్తుకు పునాది



- చిన్నేరు కుంట శుభ్రత కార్యక్రమాన్ని ప్రారంభించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్):నీటి వరుల సంరక్షణతో భవిష్యత్తును నిర్మించగలుగుతామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ అన్నారు. నీటి సంరక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఏటుకూరు రోడ్ లోని చిన్నేరు కుంట చెరువు శుభ్రత కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నసీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నీటి వనరుల సంరక్షణ భవిష్యత్తు తరాలకు పునాది వంటిదని చెప్పారు. రాష్ట్రంలో నీటి సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అన్నారు. రాష్ట్రంలో శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు నదులు అన్నసంధానమే ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో భూగర్భ జలాలు పెరిగాయని తెలిపారు. రాష్ట్రంలో 38 చెరువుల్లో ఇప్పటికే 19 చెరువులను పూర్తిగా నింపినట్లు వెల్లడించారు. నీరు– చెట్టు, నీరు –మీరు వంటి కార్యక్రమాల ద్వారా నీటి సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తెలుగుదేశం పార్టీ "30 ఏళ్ల క్రితమే నీటిని ఆదా చేయలేని సమాజం భవిష్యత్తును నిర్మించలేద" అనే నినాదంతో నీటి సంరక్షణకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఇంకుడు గుంతలు, చెక్ డ్యాముల నిర్మాణం, కాలువల పూడికతీత, చెరువుల పునరుద్ధరణ వంటి కార్యక్రమాలతో నీటిని ఒడిసి పట్టుకుంటున్నట్టు వివరించారు.

## పీకల వాగు కాలువ పూడిక తీత పనులను సమీక్షించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్):ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జలవనరుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "నీటి భద్రత – సాగు నీటి సంఘాల బాధ్యత" అనే 100 రోజుల కార్యక్రమంలో భాగంగా, గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పూడిక తీత పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమం 2026 ఏప్రిల్ 6 నుండి జూలై 14 వరకు నిర్వహించబడుతున్న నేపథ్యంలో, సోమవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి ప్రత్యక్షంగా పనులను పరిశీలించారు.

పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ సమీపం నుండి ఏటి అగ్రహారం వరకు చేపట్టనున్న పూడిక తీత పనులను ఎమ్మెల్యే గళ్ళా మాధవి సమీక్షించి, పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. కాలువల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించడం ద్వారా నీటి పారుదల సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ చల్లా ఓబులేసు, డివిజన్ అధ్యక్షులు పోపురి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# 16 వేల గ్రామాల్లో బీజేపీ 'మన ఊరు - మన జెండా'







(మొదటి పేజీ తరువాయి)

జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావుతో పాటు పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యక్రమం సందర్భంగా గ్రామంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, "మన ఊరు -- మన జెండా" కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా 16 వేల గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలో జెండా దిమ్మలపై క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి, కేంద్ర ప్రభుత్వం అందించిన నిధులు, అభివృద్ధి పనుల వివరాలు ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మోతడక గ్రామంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన వివరించారు. గ్రామానికి సుమారు రూ. 3 కోట్ల నిధులు అందించగా, జల జీవన్ మిషన్ కింద రూ. 1.24 కోట్లతో ప్రతి ఇంటికి తాగునీటి కనెక్షన్లు కల్పించినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా 685 మందికి 120 రోజుల పని కల్పించారని చెప్పారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద 174 ఇళ్ల నిర్మాణం జరుగుతోందని పేర్కొన్నారు.

పేదల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని, స్వచ్ఛ భారత్ ద్వారా మరుగుదొడ్ల నిర్మాణం, ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ. 5 లక్షల వరకు వైద్య భీమా, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలల పోషణ వంటి పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని తెలిపారు.

గ్రామాల్లో ప్రతి ఇంటికి ట్యాప్ కనెక్షన్ అందించడమే కాకుండా మహిళల కష్టాలను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు.

2047 నాటికి భారతదేశాన్ని వికసిత భారత్‌గా తీర్చిదిద్దడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం పేదల అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తోందని మాధవ్ అన్నారు. కేంద్ర పథకాల ప్రయోజనాలు ప్రతి ఇంటికీ చేరేలా బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ, గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయడం పార్టీ కార్యకర్తల బాధ్యత అని అన్నారు. "మన ఊరు – మన జెండా" కార్యక్రమం ద్వారా గ్రామాల్లో బీజేపీ ప్రభావం మరింత పెరుగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

బీజేపీ తాడికొండ మండల అధ్యక్షులు బండ్ల అశోక్ మాట్లాడుతూ, మోతడక గ్రామంలో ఈ కార్యక్రమం ప్రారంభించడం గర్వకారణమని పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు కేంద్ర పథకాలపై అవగాహన కల్పిస్తూ, ప్రతి ఇంటికీ బీజేపీ జెండా ఎగురవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ అభివృద్ధి లక్ష్యాలతో ముందుకు సాగుతుందని తెలిపారు.

తాడికొండ బీజేపీ మండల అధ్యక్షులు బండ్ల అశోక్ సభాధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమార స్వామి, ఎస్సీ రాష్ట్ర అధ్యక్షులు పనతల సురేష్, మైనార్టీ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ భాషా, తాడికొండ వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రమాదేవి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మంచికలపూడి గంగాధర్ రావు, మండల ప్రధాన కార్యదర్శులు గూడూరు ప్రదీప్, జవ్వాది సురేష్, ఉపాధ్యక్షులు కొణతం శ్రీదేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు కోట సాంబశివరావు, యువ మోర్చా వెంకట కృష్ణ, ఆరుద్ర గోపి, షేక్ బిలాల్, మార్తా నరేంద్ర, కంతేటి బ్రహ్మయ్య, వైవి సుబ్బారావు, దర్శనం శ్రీనివాస్, కొత్తూరు వెంకట సుబ్బారావు, సీహెచ్ యశ్వంత్, ధారా సాంబయ్య, వెలగలేటి గంగాధర్, నడ్డి నాగమల్లేశ్వరి, ఫైరోజ్ ఖాన్, ఈదర శ్రీనివాస రెడ్డి, పాలపాటి రవికుమార్, తుళ్లూరు మండల అధ్యక్షులు నీరుకొండ లక్ష్మీనారాయణ, మేడుకొండూరు మండల అధ్యక్షులు షేక్ బాషా, చరక కుమార్ గౌడ్, బజరంగ్ రామకృష్ణ, దేసు సత్యనారాయణ, హేమ సుందర్, హరిపావని తదితరులు పాల్గొన్నారు.

# సేవా పథంలో నిడదవోలు సరికొత్త రికార్డు.. 21 నెలల్లో 781 మందికి రూ.5.66 కోట్ల లబ్ధి

నిడదవోలు(జర్నలిస్ట్ ఫైల్) : నిరుపేదల ఆరోగ్య భద్రతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ఆపదలో ఉన్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఒక సంజీవనిలా మారుతోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సోమవారం నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలం తీపర్రులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 108 మంది లబ్ధిదారులకు రూ. 54,45,187 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు మరియు ఎల్ వోసీ పత్రాలను ఆయన స్వయంగా పంపిణీ చేశారు.

**సేవా యజ్ఞంలో మైలురాయి** : ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఎవరైతే అనారోగ్యం బారిన పడి ఇబ్బందులు పడుతున్నారో వారికి బాసటగా నిలుస్తున్నామని ఈ క్రమంలో గత 21 నెలల కాలంలో నిడదవోలు నియోజకవర్గంలో మొత్తం 781 మందికి రూ. 5,66,65,438 ఆర్థిక లబ్ధి చేకూర్చామని, సేవా పథంలో



ఇదొక రికార్డు అని పేర్కొన్నారు. నేడు పంపిణీ చేసిన వాటిలో 105 మందికి రూ.47,41,478 విలువైన చెక్కులు, ముగ్గురికి రూ. 7,03,709 విలువైన ఎల్ వోసీ పత్రాలు ఉన్నాయని వివరించారు. ప్రతి 15 రోజులకోసారి లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్నామని, ఇదొక నిరంతర ప్రక్రియ అని తెలిపారు. వెలగపూడి సచివాలయంలోని సీఎంఆర్ఎఫ్ టీమ్ పనితీరును ఆయన అభినందించారు.

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లకు మంత్రి దుర్గేష్ ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో దిగ్విజయంగా అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు తమ చల్లని మనసుతో, దీవెనలతో ఆశీర్వదించాలని మంత్రి దుర్గేష్ కోరారు. ప్రభుత్వం చేస్తున్న ఈ మంచి కార్యక్రమాల్లో ప్రజలు కూడా భాగస్వాములై, సమాజ పునర్నిర్మాణానికి సహకరించాలని మంత్రి దుర్గేష్ పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నాగరాజుకు మంత్రి దుర్గేష్ ధన్యవాదాలు తెలిపారు.

అనంతరం సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ వోసీ పత్రాలు పొందిన లబ్ధిదారులు మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయి వైద్యం నిరుపేదలకు అందేలా చొరవ చూపిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు మంత్రి కందుల దుర్గేష్‌లకు లబ్ధిదారులు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంత్రి దుర్గేష్ అందించిన చెక్కులతో తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటామని వెల్లడించారు.

**విజయవంతంగా సూపర్ సిక్స్ అమలు:** 'తల్లికి వందనం', 'అన్నదాత సుఖీభవ', 'స్త్రీశక్తి', ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల వంటి హామీలను కూటమి ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. ట్రాన్స్ జెండర్లకు, దివ్యాంగ శక్తి ద్వారా దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని, దివ్యాంగుల సహాయకులకు టికెట్ ధరలో 50 శాతం రాయితీ ఇస్తున్నామని గుర్తుచేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చడమే తమ లక్ష్యమన్నారు.

ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నాగరాజు, కూటమి నాయకులు, లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# నాలుగు రాష్ట్రాలకు వరం.. మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు !

(మొదటి పేజీ తరువాయి)

కాంపన్సేషన్ వేరే ప్రాంతంలో ఇస్తామన్నారు. రోడ్డు, రైల్వే పనులు జరగక పోర్ట్ ప్రారంభం జరగలేదని, ఆ పనులు త్వరితగతిన చేపడుతున్నట్లు చెప్పారు. ట్రయల్ కు మరో షిప్ తీసుకు వస్తామని, అనంతరం ఈ యేడాదే మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్ట్ ప్రారంభిస్తామన్నారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలో అంగన్వాడీ కేంద్రాలు, తాగునీరు, దేవదాయం, తదితర మౌలిక వసతులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. మూలపేట పోర్టు నిర్వాసితులకు ఏర్పాటు చేయనున్న ఆర్ అండ్ ఆర్ కాలనీ రాష్ట్రంలో ఆదర్శంగా తీర్చి దిద్దుతామన్నారు. ఈ ప్రాంతానికి పోర్టుతో అనుబంధమయ్యే పరిశ్రమలు రావాలన్నారు. పరిశ్రమలు వస్తే తప్ప ఉపాధి ఉండదన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు సానుకూల వాతావరణం ఉండాలన్నారు.

మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్ట్ పనులు ఇప్పటి వరకు 70 శాతం పనులు జరిగినట్లు రాష్ట్ర రహదారులు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు శాఖ మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి స్పష్టం చేశారు. మూలాపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టులో జరుగుతున్న అభివృద్ధి పనులను వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో కలిసి పర్యటించిన రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి.. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పాల్గొన్నారు. పోర్టులో జరుగుతున్న అభివృద్ధి పనుల తీరుతెన్నులను ప్రత్యేకంగా పరిశీలించారు.

పరిశీలన అనంతరం పోర్టు పనుల పురోగతిపై అధికారులతోను, పోర్టు యాజమాన్యంతో సమీక్షించారు. పోర్టు పురోగతి పనులను మరింత వేగవంతం చేయాలని మంత్రులు ఆదేశించారు. ఈ ఏడాది చివరి నాటికి పోర్టు పనులను పూర్తి చేసి ఆపరేషన్లు ప్రారంభించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సంయుక్తంగా ప్రకటించారు.

ఈ సందర్భంగా మంత్రి బిసి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ



మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్ట్ నిర్మాణంతో శ్రీకాకుళం జిల్లా ప్రజల చిరకాల వాంఛ తీరనుందన్నారు. పోర్టు నిర్మాణంలో పెండింగ్ సమస్యలు, ఇతర సమస్యలు పైన చర్చించారు. ఎప్పటిలోగా పనులు పూర్తవుతాయనే అంశంపైనా చర్చించారు. దాదాపు రూ. 4361.91 కోట్లతో చేపట్టిన మూలాపేట పోర్టు పనుల్లో.. ఫేజ్ 1 లో 1524 ఎకరాల్లో 4 బెర్త్ ల నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు.

2025 అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ భూ సేకరణ వంటి అనివార్యకారణాలతో 2026 నవంబర్ నాటికి పోర్టును ప్రారంభించాలన్న దృఢ నిశ్చయంతో పనిచేస్తున్నట్లు వెల్లడించారు. మూలాపేట పోర్టు ఉత్తరాంధ్రలో వ్యూహాత్మకంగా కీలక స్థానంలో ఉందన్నారు. ఈ పోర్టు నిర్మాణంతో ఆంధ్రప్రదేశ్ తో పాటు తీర ప్రాంతం లేని, సరిహద్దు రాష్ట్రాలైన చత్తీస్ఘడ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్..దక్షిణ ఒడిస్సా ప్రాంతాలకు ఇది అత్యంత అందుబాటులో ఉండే పోర్టు కావడం కలిసొచ్చే అంశమన్నారు. మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టుకు సంబంధించి ప్రజలకు వాస్తవాలు తెలియజేయాల్సిన బాధ్యత తమపై ఉందని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు ప్రతి మూడు నెలలకు ఒకసారి పోర్టుల పురోగతిపై సమీక్ష చేస్తున్నట్లు వెల్లడించారు.

2024 జూన్ నాటికి పోర్టు భౌతిక పురోగతి.. మొత్తం 25.02 % గా ఉండగా.. ప్రస్తుతం 74.65 % పనులు శరవేగంగా పూర్తి చేశామని చెప్పారు. గత 20 నెలల్లో దాదాపు 49.63 % పనులు పూర్తి చేసినట్లు వివరించారు. లిబ్రేక్‌వాటర్ పనులులి జూన్ 2024 నాటికి 28.9% పూర్తయితే గత 20 నెలల్లో 63.48 % శాతం పూర్తి చేశాం.. మొత్తంగా 92.38 % శాతం పనులు పూర్తి చేసినట్లు చెప్పారు.

డ్రెడ్జింగ్ & రిక్లమేషన్ పనులులి జూన్ 2024 నాటికి 37.8% పూర్తయ్యితే గత 20 నెలల పాలనలో 51.91 % పనులు పూర్తి చేశామన్నారు.. మొత్తంగా ఇప్పటి వరకు 89.71 % పనులు పూర్తయ్యాయి.

బెర్త్ లకు సంబంధించిలి జూన్ 2024 నాటికి 26.3% శాతం పనులు పూర్తయితే, గత 20 నెలల్లో 51.53 % పనులు పూర్తి చేశాం.. మొత్తంగా 77.83 % పనులు పూర్తయ్యాయన్నారు.

ఆన్‌షోర్ మౌలిక వసతులులి గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమే కాలేదు.. గత 20 నెలల్లో దాదాపు 13.65 % పనులు పూర్తి చేసినట్లు వెల్లడించారు.

బాహ్య మౌలిక వసతులు కల్పన పనులకు సంబంధించిలి 2024 జూన్ నాటికి 2.3% పూర్తయితే గత 20 నెలల్లో 29.39 % పూర్తి చేశాం.. మొత్తంగా ఇప్పటి వరకు 31.69 % పనులు పూర్తయ్యాయన్నారు.

ఆర్థిక పురోగతిలి 2019–24లో రూ. 718.50 కోట్లు గత ప్రభుత్వం ఖర్చు చేస్తే.. ప్రస్తుతం రూ. 1835.98 కోట్ల మేర పనులు చేపట్టడం జరిగిందన్నారు. మొత్తంగా గత 20 నెలల పాలనలో రూ. 1117.48 కోట్లు వెచ్చించడం జరిగిందన్నారు.

పోర్టుకు సంబంధించి ఉప్పు భూముల సేకరణలి విషయంలో గత ప్రభుత్వం ఎటువంటి ప్రయత్నం చేసిన పాపాన పోలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, 385.24 ఎకరాల భూసేకరణకు అనుమతి పొందడం జరిగిందన్నారు.

గత ప్రభుత్వంలో మూలాపేట, విష్ణుచక్రం గ్రామాల్లో పునరావాసం కోసం ఎటువంటి చర్యలు చేపట్టలేదని, గత 20 నెలల కూటమి ప్రభుత్వ పాలనలో విష్ణుచక్రం గ్రామంలో పూర్తిగా పునరావాసం కల్పించడం జరిగిందన్నారు. అలాగే మూలపేట గ్రామంలో పునరావాస పనులు ఇప్పటికే పురోగతిలో ఉన్నట్లు వివరించారు. పునరావాసానికి సంబంధించి తాగునీరు కోసం పైప్ లైన్లు, స్వచ్ఛభారత్ కింద టాయిలెట్లు నిర్మాణం, ట్రాన్స్కో, రైల్వే లైన్ వంటి సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చినట్లు చెప్పారు. నేపాడ జంక్షన్లో ఫ్లైఓవర్ ఏర్పాటుకు అధికారులతో చర్చించినట్లు పేర్కొన్నారు. మూలాపేట పోర్టును అధికారులు ప్రతినిత్యం సమీక్షిస్తున్నట్లు తెలిపారు. మూడు నెలలకు ఒకసారి పోర్టులపై పురోగతి పై ప్రత్యేకంగా సీఎం చర్చిస్తున్నట్లు పేర్కొన్నారు. జూలై, ఆగస్టు నెలలో ప్రధాన మంత్రి ఆధ్వర్యంలో భోగాపురం ఎయిర్పోర్ట్ పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, మారిటైం బోర్డు నుండి సిఈఓ అభిషేక్ కుమార్, చీఫ్ ఇంజనీర్ రాఘవరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మునిరెడ్డి, ఆర్డీఓ కృష్ణమూర్తి, టాటా కన్సల్టింగ్ ఇంజనీరింగ్ లిమిటెడ్ నుండి ఎ. అనీల్ కుమార్, జి. అనీల్ కుమార్, పి. వివేకనంద, ఎస్బీ కిరణ్ కుమార్, దొరబాబు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరి వర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

### దేశ సేవే బీజేపీ ధ్యేయం

## పేదల అభివృద్ధే లక్ష్యం



- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ

అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) : బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ పార్టీ కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. దేశ సేవే ధ్యేయంగా, పేదల సంక్షేమమే లక్ష్యంగా బీజేపీ నిరంతరం పనిచేస్తోందని పేర్కొన్నారు.

సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతమైందన్నారు. ప్రతి ఇంటికీ మౌలిక సదుపాయాలు చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.

ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడంలో బీజేపీ కీలక పాత్ర పోషిస్తోందని, దేశాన్ని ప్రపంచ స్థాయిలో ముందంజలో నిలబెట్టే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తలు గ్రామ స్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాయకులు, కార్యకర్తలందరికీ అభినందనలు తెలిపారు.




# పిజిఆర్ఎస్‌కు 374 అర్జీలు



ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో( జర్నలిస్ట్ ఫైల్): జిల్లాలో పి.జి.ఆర్.ఎస్ కు మొత్తం 374 అర్జీలు అందాయి. అందులో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పి.జి.ఆర్.ఎస్ కు 168, పోలీస్ సూపరింటెండెంట్ కార్యాలయంలో జరిగిన పి.జి.ఆర్.ఎస్ కు 131 అర్జీలు, గుంటూరు రెవిన్యూ డివిజన్ పరిధిలో 7 అర్జీలు, తెనాలి రెవిన్యూ డివిజన్ పరిధిలో 15 అర్జీలు, గుంటూరు నగర పాలక సంస్థకు 45, మిగిలిన మున్సిపాలిటీల పరిధిలో 8 అర్జీలు అందాయి సోమవారం ఎస్ ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. దివ్యాంగుల వద్దకు నేరుగా వెళ్లి అర్జీలు స్వీకరించారు. అర్జీదారులు పింఛన్లు, రేషన్ కార్డులు, గృహాలు మంజూరు చేయాలని, భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ అర్జీలను సమర్పించారు.

**అందిన అర్జీలలో కొన్నింటి వివరాలు**

తెనాలి మండలం అంగలకుదురు గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను తొలగించాలని కోరారు. గుంటూరు పట్టణం గడ్డిపాడుకి చెందిన ఎన్. రాజ్ కిరణ్ అర్జీని సమర్పిస్తూ గడ్డిపాడులో ప్రజా ఆరోగ్యం పట్ల చర్యలు తీసుకోవాలని కోరారు.గుంటూరు శశాంక్ గోయల్ కాలనీకి చెందిన ఇ.లక్ష్మీ గృహాన్ని మంజూరు చేయాలని అర్జీని సమర్పించారు.వేసవి దృష్ట్యా సత్య సాయి సేవా సమితి మజ్జిగ పాకెట్ లను పి.జి.ఆర్.ఎస్ కు వచ్చిన అర్జీదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ గంగరాజు, లక్ష్మీకుమారి, సి.ఆర్.డి.ఎ అధికారి డేవిడ్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.పద్మావతి, ఉద్యాన శాఖ ఉప సంచాలకులు రవీంద్ర బాబు, పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ,జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.దుర్గా భాయి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి ప్రసూన,జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన నేషనల్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ): వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్శిటీ లో ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్.టి.పి.సి. చెరుకూరి లెనిన్ వోల్గా మెమోరియల్ "నేషనల్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్" పోటీలు ఘనంగా ముగిశాయి. మార్చి 26 నుండి ఏప్రిల్ 6 వరకు పదకొండు రోజుల పాటు జరిగిన ఈ పోటీలలో దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుండి సుమారు 2200 మంది క్రీడాకారులు, 500 మంది కోచ్‌లు మరియు మేనేజర్లు పాల్గొన్నారు. అండర్-10, అండర్-13, మరియు అండర్-15 విభాగాలుగా ఈ పోటీలు నిర్వహించబడ్డాయి. ఈ పోటీలలో జార్ఖండ్, తమిళనాడు, మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఆర్చర్లు అత్యధిక మెడల్స్ సాధించి ప్రతిభ కనబరిచారు. వివిఐటియు ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ విజేతలకు బహుమతులు , మెడల్స్ అందజేశారు. చెరుకూరి సత్యనారాయణ (వైస్ ప్రెసిడెంట్, ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) మాట్లాడుతూ ఆర్చరీ క్రీడ అతి పురాతనమైనదని, దీనివల్ల ఏకాగ్రత మరియు శారీరక దృఢత్వం పెరుగుతాయని తెలిపారు. లక్ష్యంపై దృష్టి సారించడం ద్వారా మెదడుపై నియంత్రణ లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. వాసిరెడ్డి మహదేవ్ (ప్రో-ఛాన్సలర్, వివిఐటియు) మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీలకు తమ విశ్వవిద్యాలయం వేదిక కావడం సంతోషంగా ఉందని, ఆర్చరీ వంటి క్రీడలు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో వివిఐటియు రిజిస్ట్రార్ డా. మల్లికార్జున రెడ్డి, ఏపీ ఆర్చరీ అసోసియేషన్ సెక్రటరీ బి. వెంకటరమణ, ఫిజికల్ డైరెక్టర్ డా. ఎన్. అరుణ్ కుమార్, షేక్ మహ్మద్ అజామ్ తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు పశ్చిమ అభివృద్ధికి రూ.406 కోట్లు : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి ఐదు కీలక ప్రాజెక్టులు : ఎమ్మెల్యే గళ్ళా మాధవి




గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్):గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిని వేగవంతం చేసేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ చల్లా ఓబులేసు కూడా పాల్గొని శాఖల వారీగా అభివృద్ధి కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి అభివృద్ధి మరియు సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ రాష్ట్రాన్ని పురోగతి దిశగా తీసుకెళ్తోందని, 2024లో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు, అప్పుల భారం, అభివృద్ధి లోటుతో ఉన్న రాష్ట్రాన్ని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం పారదర్శక, బాధ్యతాయుత పాలన అందించబడుతోందని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమరావతి, పోలవరం వంటి కీలక ప్రాజెక్టులు మళ్లీ వేగం అందుకున్నాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు.

ఇటీవల జిల్లా స్థాయి డిఆర్సి సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో 2026-27 వార్షిక బడ్జెట్‌పై సమీక్ష జరిగిందని, ఈ సందర్భంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించిన శాఖల వారీ నిధుల వివరాలు వెల్లడయ్యాయని తెలిపారు.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసం మొత్తం రూ.406 కోట్లు కేటాయించబడినట్లు వెల్లడించారు. ఈ నిధులను ప్రాధాన్యతల ఆధారంగా దశలవారీగా వినియోగిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గత వైసిపి ప్రభుత్వ నిర్ణయాల కారణంగా గుంటూరు కార్పొరేషన్‌కు చెందిన సుమారు రూ.500 కోట్ల నిధులు సి.ఎఫ్. ఎమ్. ఎస్ కు మళ్లించబడినట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. ప్రస్తుతం పన్నులు, వసూళ్ల ద్వారా వచ్చే సుమారు రూ.100 కోట్లతోనే జీతాలు, బకాయిల చెల్లింపులు మరియు మౌలిక వసతుల పనులు నిర్వహించాల్సిన పరిస్థితి ఉందన్నారు.

రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ వంటి ప్రాథమిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ నిధులను వినియోగించనున్నట్లు, అవసరమైతే అదనపు నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించనున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

1. పీకల వాగు అభివృద్ధి
ప్రక్షాళన, రిటైనింగ్ వాల్ నిర్మాణం, సిమెంట్ డ్రైనేజ్ వ్యవస్థ, భద్రత కోసం డైమండ్ మెష్ ఏర్పాటు
అంచనా వ్యయం: రూ. 145 కోట్లు
2. అంబేద్కర్ వాగు అభివృద్ధి
ఆక్రమణల తొలగింపు, డ్రైనేజ్ విస్తరణ, వరద సమస్యల నివారణ.
3. పివికే నాయుడు మార్కెట్ అభివృద్ధి
వ్యాపారులకు మెరుగైన మౌలిక వసతులు
అంచనా వ్యయం: రూ. 30 కోట్లు
4. బీసీ భవన్ నిర్మాణం పూర్తి
రివైజ్డ్ అంచనా: రూ. 10 కోట్లు
బీసీల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిర్మాణం
5. అంబేద్కర్ భవన్ నిర్మాణం
మూడు అంతస్తుల భవనం
అంచనా వ్యయం:రూ. 18 కోట్లు

ఎన్డీయే కూటమి ప్రభుత్వం సంక్షేమం మరియు అభివృద్ధిని సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందని, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. అనంతరం నియోజకవర్గ ఎన్డీయే కూటమి నేతలకు ఈ బడ్జెట్ పై అవగాహన కల్పించి, ఈ బడ్జెట్ ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, వారికి ఉన్న అపోహలను తొలగించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు.

# ప్రజల వద్దకు.. నేనున్నానంటూ..

- ఉదయాన్నే నియోజకవర్గంలో పర్యటించిన ఎమ్మెల్యే నసీర్
- శానిటేషన్, విద్యుత్, మంచినీటి సరఫరా, రోడ్ల నిర్మాణం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి
- అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేస్తామని హామీ



గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్):గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక ద్వారా ముందడుగు వేస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు సోమవారం ఉదయాన్నే గుంటూరు తూర్పు నియోజకవర్గం లోని బొంగరాలబీడు, డొంక రోడ్డు తదితర ప్రాంతాల్లో స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే నసీర్ పర్యటించారు. స్థానిక సమస్యలపై ప్రజలను అడిగి వివరాలు తీసుకున్నారు. ప్రతి రోజూ శానిటేషన్ సిబ్బంది సమయానికి వస్తున్నారా ? ఏదైనా సమస్యలు ఉన్నాయా ? డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా పని చేస్తోందా ? మంచినీటి సరఫరా వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో శానిటేషన్ వ్యవస్థలో లోపాలు ఉన్నట్లు స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని సూచించాను. అనంతరం విద్యుత్ సరఫరా, స్తంభాల ఏర్పాటు వంటి అంశాలను పరిశీలించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని, అవసరమైన ప్రదేశాల్లో నూతన పోల్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే గుంటూరు తూర్పు నియోజకవర్గం లో వందల కోట్ల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని తెలిపారు. అన్ని ప్రాంతాలకు రోడ్ల నిర్మాణం చేపడతామని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి నిత్యం ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకుంటున్నామని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధిపథంలో తీసుకెళ్లడమే లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు.

# ఏపీ రాజధానిగా అమరావతి శాశ్వతం : ప్రభుత్వ చీఫ్ విప్ జి.వి.

- ఏపీ ద్రోహిగా నిలిచిన జగన్ : జీవీ ఆంజనేయులు ధ్వజం



వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ):వినుకొండ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ విప్ జి.వి. ఆంజనేయులు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. జల ధార కార్యక్రమంలో భాగంగా శావల్యాపురం మండలం కనుమర్లపూడి గ్రామం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు మాట్లాడారు. అమరావతి రాజధానికి పార్లమెంట్ ఉభయ సభల ఆమోదంతో పూర్తిస్థాయి చట్టబద్ధత లభించిందని, ఇది రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. రాజధాని నిర్మాణానికి చంద్రబాబు నాయుడు పడుతున్న కష్టం, అకుంఠిత దీక్షను, ఆయన విజన్‌ను గుర్తించి దేశంలోని హేమాహేమీ నాయకులందరూ మద్దతు తెలుపుతున్నారని ఆయన పేర్కొన్నారు. కేవలం రాజకీయ స్వలాభం కోసం అమరావతిని నిర్వీర్యం చేసేందుకు గత ప్రభుత్వం కుట్రలు చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ?ముఖ్యంగా అమరావతిపై జగన్ అనుసరించిన వైఖరిని తప్పుబడుతూ, "మావిగన్" అనే కొత్త పేరును తెరమీదకు తేవడంపై జీవీ తీవ్రంగా స్పందించారు. ఇది రాజధానిపై జగన్ పన్నిన మరో కుట్రగా ఆయన అభివర్ణించారు. గత ఐదేళ్లలో అమరావతి కోసం భూములిచ్చిన రైతులపై జగన్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడిందని, మూడు రాజధానుల పేరుతో ప్రజలను మభ్యపెట్టడమే తప్ప కనీసం మూడు ఇటుకలు కూడా వేయలేకపోయారని ఎద్దేవా చేశారు. ?తప్పు మీద తప్పు చేస్తూ, చేసిన తప్పులను సరిదిద్దుకోకుండా, కనీసం ఆత్మవిమర్శ కూడా చేసుకోకపోవడం జగన్ రాజకీయ వైఫల్యానికి నిదర్శనమని జీవీ విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తూ, అభివృద్ధికి అడ్డుపడిన జగన్ చరిత్రలో ఆంధ్రప్రదేశ్ ద్రోహిగా మిగిలిపోతారని ఆయన మండిపడ్డారు. వైసిపి ప్రభుత్వం చేసిన అనాలోచిత నిర్ణయాలే ఆ పార్టీని నేడు ఈ దుస్థితికి తీసుకొచ్చాయని ఆయన ధ్వజమెత్తారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శానిటరీ సిబ్బందికి సకాలంలో జీతాలుఇవ్వాలి



- కార్మికుల ఆందోళన

తెనాలి(జర్నలిస్ట్ ఫైల్): కష్టకాలం లో వెంటనే జీతాలు చెల్లించాలని కోరుతూ తెనాలి మున్సిపల్ కార్యాలయం వద్ద శానిటేషన్ కార్మికులు సి ఐటియు ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. మున్సిపల్ కార్యలయం వద్ద ధర్నా చేపట్టిన కార్మికులు కమీషనర్ జె.రామ అప్పలనాయుడుకు తమ డిమాడ్స్ తొ, కూడిన వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా సి ఐటియునాయకులు కొల్లిపర బాబు ప్రసాద్ మాట్లాడుతు ప్రజా ఆరోగ్యానికి పారిశుధ్యం కీలకమని, పారిశుధ్య నిర్వహణకు కార్మికులు అంతే కీలకం అన్నారు.కార్మికులకు సకాలంలో జీతాలు, వారి ఇతర చట్ట పరమైన సౌకర్యాలు సక్రమంగా అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం చట్టం నిర్దేశించిన సమయంలొ ఇవ్వాలన్నారు.సకాలంలో జీతాలు చెల్లించ క ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు జీతాల చెల్లింపు విధానం లో మార్పులు చేయుటకు, ముందు చట్టం ప్రకారం నోటీస్ఇవ్వాలని చెప్పారు. వేతనాలు జాప్యంకు అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుంది అని చెప్పారు. ప్రభుత్వం యేమీ పట్టించుకోవడం లేదని విమర్శించారు

మున్సిపాలిటీ కి పుష్కలంగా నిధులు వున్నా వేతనాలు చెల్లించక పోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు షేక్ హుసేన్ వలి, జి.వెంకట సుబ్బయ్య, ఎమ్. మరియమ్మ, మంగళగిరి వెంకటేశ్వర్లు, రాచూరి వెంకటేశ్వర్లు, ఉన్నవ సుధాకర్, వీ. నాగరాజు, లక్ష్మి నారాయణ , షేక్ కరీం, డి. శ్రీధర్ బాబు, కనపర్తి వినయ్,ఎమ్. వెంకన్న స్వామి, కె. పిచ్చమ్మ,గాదె నాగ లక్ష్మి, రత్న కుమారి,ఎమ్. సోమేశ్వర్రావు, బి. రాఘవేంద్ర రావు ,కంచర్ల లక్ష్మి, సుజాత, ప్రసన్న మీనాక్షి, శ్రీలక్ష్మి, మేరీ కృప,తిరుపతమ్మ,భారతి, శివ,గంజి రమణ పాములు, నరసింహ ఆదాము, సౌరమ్మ, మధు బాబు, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ వ్యర్థాల తొలగింపుకు స్పెషల్ డ్రైవ్



- వారం రోజుల్లో లక్ష్యం పూర్తి కావాలి
- ఇక నుండి నిర్మాణ వ్యర్థాలు వేసే వారిపై భారీ మొత్తంలో అపరాధ రుసుం విధింపు
- సెట్ కాన్ఫరెన్స్ లో అధికారులకు కమిషనర్
- నగర కమిషనర్ మయూర్ అశోక్ ఆదేశం

ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో( జర్నలిస్ట్ ఫైల్): నగరంలోని ప్రధాన రహదారులు, అంతర్గత వీధులు మరియు ఖాళీ స్థలాలలో పేరుకుపోయిన భవన నిర్మాణ వ్యర్థాలను ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన తొలగించాలన్నారు. సోమవారం అధికారులతో నిర్వహించిన సెట్ కాన్ఫరెన్స్ లో కమిషనర్ మాట్లాడుతూ, నగరవ్యాప్తంగా అన్ని వార్డుల్లో వారం రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, వ్యర్థాలను పూర్తిగా తొలగించాలన్నారు.

సచివాలయ కార్యదర్శులు తమ పరిధిలోని రోడ్లపై ఎక్కడెక్కడ వ్యర్థాలు ఉన్నాయో గుర్తించి, వెంటనే వాటిని తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్మాణ వ్యర్థాల తరలింపు ప్రక్రియను వారం రోజుల్లోనే పూర్తి చేయాలని గడువు విధించారు. భవన నిర్మాణాలు చేపట్టే యజమానులు మరియు కాంట్రాక్టర్లు తమ వ్యర్థాలను రహదారుల పక్కన, డ్రైనేజీ కాలువలలో పారబోయడం వల్ల ట్రాఫిక్‌కు ఆటంకం కలగడమే కాకుండా, పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయని, ఇకపై ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై మట్టి, రాళ్లు, ఇటుకలు వంటి శిథిలాలను వేస్తే వారిపై భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నిఘా పెంచి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. భవన నిర్మాణ వ్యర్థాలను తరలించడానికి నిర్దేశించిన ప్రాంతాలకు మాత్రమే తరలించాలని, ఒకవేళ సొంతంగా తరలించలేని పక్షంలో నగరపాలక సంస్థ నిర్ణయించిన రుసుము చెల్లించి సేవలను వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు.

## ప్రజల నుంచి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో( జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థలో చేపట్టే పిజిఆర్ఎస్ లో ప్రజలు ఇస్తున్న అర్జీలు రీ ఓపెన్ కాకుండా, ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దేశిత గడువులోగా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. సోమవారం నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశాల మేరకు కౌన్సిల్ హాల్లో పిజిఆర్ఎస్ ను అదనపు కమిషనర్ నిర్వహించారు.

ఈ సందర్భంగా అదనపు కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ పిజిఆర్ఎస్ లో ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలన్నారు. అర్జీలు బియండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లడానికి వీలులేదన్నారు. క్షేత్ర స్థాయి అధికారులు ఆర్జీలను నేరుగా వెళ్లి పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

పిజిఆర్ఎస్ ద్వారా 45 ఫిర్యాదులు అందాయని, పట్టణ ప్రణాళిక విభాగం 17, ఇంజినీరింగ్ విభాగం 18, రెవెన్యూ విభాగం 7, ప్రజారోగ్య విభాగానికి సంబందించి 3 ఫిర్యాదులు అందాయన్నారు. పిజిఆర్ఎస్ లో ప్రజల నుండి అందిన ఆర్జీలను విభాగాల వారిగా విబజించి, సంబంధిత విభాగాదిపతులకి పంపి సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, జి.సాంబశివరావు, సిటి ప్లానర్ రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, యస్.ఈ జి. వెంకటేశ్వరరావు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పెరటి మొక్కలకు హోమ్ కంపోస్ట్ బెస్ట్ : కమీషనర్ జె.రామ అప్పలనాయుడు

తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):అపార్ట్మెంట్స్, గృహసముదాయాల నుండి వచ్చే తడి, వ్యర్థాలను, ఉపయోగించి, హోం కంపోస్ట్ తయారు చేయడం ద్వారా పెరటి మొక్కలకు బలమైన ఎరువు లభిస్తుందని మున్సిపల్ కమీషనర్ రామ అప్పల నాయుడు స్లమ్ సమాఖ్య సభ్యులకు సూచించారు.

స్థానిక కొత్తపేటలోని మహిళా మండలి భవన్ లో గల మెప్మ కార్యాలయం లో స్లమ్ సమాఖ్య మహిళలకు,సోమవారం ఏర్పాటు చేసిన హోమ్ కంపోస్ట్ కిట్ల పంపిణీ కార్యక్రమంలో, మున్సిపల్ కమీషనర్ జె. రామ అప్పల నాయుడుపాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ఇళ్లలో,అపార్ట్మెంట్స్ నుండి వచ్చే తడి చెత్త, పొడి చెత్తను వేరు వేరు గా పురపాలక సంఘం వాహనాలకు అందించాలని కోరారు.కుళ్ళి పోయే స్వభావము కలిగిన కురగాయలు, మిగిలిన అన్నం వంటివి డబ్బాలో వేసుకుని, వాటికి కొబ్బరి పీచు జతచేసి ఎరువు తయారు చేసుకోవచ్చని తెలిపారు.హోమ్ కంపోస్ట్ తయారు చేసుకోడం ద్వారా చెత్త ఉత్పత్తి తగ్గించడం తో పాటు, తయారు చేసుకున్న ఎరువును పెరటితోట మొక్కలకు వేసుకుంటే మంచి ఫలితం ఉంటుందనీ అన్నారు. గృహాలవారు, అపార్ట్మెంట్స్ లో నివసించేవారు ఈ విధానాన్ని పాటించాలని కోరారు. ఆర్ పి లు,డ్వాక్రా సంఘాల సభ్యులు మీ ప్రాంతంలో ఉన్న వారికి హోమ్ కంపోస్ట్ పై అవగాహన కల్పించి ఎక్కువ మంది ని, ఆదిశగా ప్రోత్సహించాలని కోరారు. తెనాలి పట్టణాన్ని చెత్త రహిత పట్టణముగా చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. శానిటరీ ఇన్స్పెక్టర్ లు శ్రీనివాసరావు ,అనుపమ , సీఎంఎం విజయకుమారి, సి ఓ లు, ఆర్ పి లు, మెప్మ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం సమాఖ్య సభ్యులకు హోం కంపోస్ట్ కిట్ల ను పంపిణీ చేశారు.



# పేదరికం చదువుకు ఆటంకం కారాదు : ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

- పేద విద్యార్థికి "స్ఫూర్తి" ఆలంబన
- గ్రూప్ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందించిన ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి



గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్): గ్రూప్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న ఓ పేద విద్యార్థికి స్ఫూర్తి ఫౌండేషన్ ఆలంబనగా నిలిచింది. పేదరికం కారణంగా కోచింగ్ మాట దేవుడెరుగు.. కనీసం తాను సొంతంగా ప్రిపేర్ అయ్యేందుకు అవసరమైన పుస్తకాలను కూడా కొనుక్కోలేక అవస్థలు పడుతున్న అతనికి అండదండలందించింది. అత్యంత విలువైన పుస్తకాలను కొనుగోలు చేసి అందజేసింది.

పల్నాడు జిల్లా, కారంపూడి మండలం, ఒప్పిచర్ల గ్రామానికి చెందిన మొగిలి సైదులు ఓ సామాన్య కుటుంబానికి చెందిన నిరుపేద యువకుడు. అయినా పట్టుదలతో చదివి అన్ని పరీక్షలలో అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. అదే క్రమంలో గ్రూప్ పరీక్షలు కూడా రాయాలన్న అతని ఆశయానికి పేదరికం ప్రధాన ఆటంకంగా పరిణమించింది.

ఈ సమస్యను ఎలా అధిగమించాలా.. అని యోచన చేస్తున్న సైదులుకు, "చదువుకు పేదరికం ఆటంకం కారాదు" అన్న మహోన్నత ఆశయంతో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి స్థాపించిన స్ఫూర్తి ఫౌండేషన్ గురించి తెలిసింది. దీంతో మొగిలి సైదులు ఈ విషయమై వెంటనే స్ఫూర్తి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్‌ని సంప్రదించడంతో అతని పని సానుకూలం అయింది.

ఈ నేపథ్యంలో సోమవారం స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గ్రూప్ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను శాసనమండలి సభ్యులు, స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి స్వయంగా మొగిలి సైదులుకు అందజేశారు.

అనంతరం ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ, నేటి విద్యార్థులే రేపటి నవ సమాజ నిర్మాతలని వ్యాఖ్యానించారు. అలాంటి విద్యార్థులపై చేసే ఖర్చు వారి కుటుంబ భవిష్యత్తుకే కాకుండా, యావత్ సమాజ అభివృద్ధికి, శ్రేయస్సుకు పెట్టుబడి వంటిదని పేర్కొన్నారు. సామాజిక స్థితిగతులను మార్చే శక్తి ఒక్క విద్యకే ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అంతటి విలువైన విద్యను కేవలం పేదరికం వలన పొందలేక పోవడం దురదృష్టకరమన్నారు. అందుకే అందరికీ అత్యున్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్య ఉచితంగా అందుబాటులోకి రావాలన్న మహనీయుల గొప్ప సంకల్పానికి తన వంతు చిన్న ప్రయత్నంగా "స్ఫూర్తి ఫౌండేషన్" ఏర్పాటు చేసి తద్వారా పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు కంజుల సత్యనారాయణరెడ్డి, ముత్యం, గంగాధర్ రెడ్డి, పుల్లారెడ్డి, ఖాన్, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీఈసీ సభ్యులు మందపాటి శేషగిరిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ బత్తుల దేవానంద్, మాజీ కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), పాపతోటి అంబేద్కర్, దూపాటి వంశీ, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశపోగు శ్రీనివాసరావు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నేత నూనె ఉమామహేశ్వరరెడ్డి, ఓర్చు శ్రీనివాసరావు, బైరెడ్డి రవీంద్రారెడ్డి, రెడ్డి కోటేశ్వరరావు, సుబ్బరాజు, రేజేటి నవీన్, విప్పర్ల కోటేశ్వరరావు, మల్లా చిన్న, వలివేటి వెంకటరమణ, సుందరరావు, మన్నేపల్లి హనుమంతరావు, సీహెచ్ రమణ, గోపి, సమీర్, సుశీల రావు, నీలి, నారాయణ, చందు, నిమ్మగడ్డ, ఆటో శ్రీను, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# ఏపీ బీజేపీ కార్యక్రమానికి ఢిల్లీ నుంచి అభినందనలు



గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్):భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ స్వీయ పర్యవేక్షణలో స్వీయ పర్యవేక్షణలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "మన ఊరు.. మన జెండా" కార్యక్రమానికి జాతీయ స్థాయిలో ప్రశంసలు లభించాయి. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించిన సందర్భంగా బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్, పీవీఎన్ మాధవ్‌ను ఫోన్ ద్వారా అభినందించారు.

గుంటూరు జిల్లా తాడికొండ మండలం మోతడక గ్రామంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించిన వెంటనే నితిన్ నబిన్ ఫోన్ చేసి మాధవ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసే దిశగా ఈ కార్యక్రమం కీలకంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలో బీజేపీ జెండా ఎగురవేసే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం ప్రశంసనీయం అని నితిన్ నబిన్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామస్థాయికి చేరవేయడంలో "మన ఊరు.. మన జెండా" కార్యక్రమం ముఖ్య పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు.

ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు గ్రామ గ్రామానికి వెళ్లి ప్రజలతో మమేకం కావాలని, కేంద్ర పథకాల ప్రయోజనాలను వివరించాలని సూచించారు. రాష్ట్రంలో ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు.



# బీజేపీతో ప్రతి గ్రామానికి అభివృద్ధి, ప్రతి కుటుంబానికి సంక్షేమం




○ **ఏపీ బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జ్ డా. కిలారు దిలీప్**

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ కార్యకర్తలు, నాయకులకు ఏపీ బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జ్ డా. కిలారు దిలీప్ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో డా. కిలారు దిలీప్ మాట్లాడుతూ, దేశ సేవే ధ్యేయంగా, పేదల అభివృద్ధే లక్ష్యంగా బీజేపీ నిరంతరం పనిచేస్తోందని పేర్కొన్నారు. సంపన్నమైన భారత నిర్మాణానికి అంకితభావంతో ముందుకు సాగుతున్న పార్టీగా బీజేపీ ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. ప్రతి గ్రామానికి అభివృద్ధి, ప్రతి కుటుంబానికి సంక్షేమం చేరేలా కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. భారతదేశాన్ని ప్రపంచంలో ముందంజలో నిలబెట్టే దిశగా బీజేపీ నాయకత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.

ఈ గొప్ప ప్రయాణంలో భాగస్వాములైన ప్రతి కార్యకర్తకు, నాయకులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో ప్రజాసేవలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# అమరావతి చట్టబద్ధత, బకాయిల చెల్లింపుపై 'థాంక్యూ సీఎం'




○ **తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం**

**ఒంగోలు (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతికి శాశ్వత చట్టబద్ధత కల్పించడం, అలాగే ఉద్యోగులకు పెండింగ్ బకాయిల చెల్లింపులపై రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టీఎన్‌యుఎస్) ఆధ్వర్యంలో "థాంక్యూ సీఎం సార్" కార్యక్రమం నిర్వహించారు.

ఇటీవల పార్లమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014లో సవరణలు చేసి అమరావతిని రాష్ట్ర రాజధానిగా చట్టబద్ధత కల్పించడం పట్ల సంఘం నేతలు హర్షం వ్యక్తం చేశారు. అలాగే 2019-24 మధ్యకాలంలో గత ప్రభుత్వం చెల్లించాల్సిన ఏపీజీఎల్ఐ, జీపీఎఫ్, గ్రాట్యుటీ, సరెండర్ లీవ్, లీవ్ ఎన్కాష్‌మెంట్ వంటి బకాయిలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం విడతలవారీగా చెల్లించడం అభినందనీయమని పేర్కొన్నారు.

ప్రస్తుతం రూ. 7,358 కోట్ల బకాయిలను విడుదల చేయడంతో పాటు గత రెండు సంవత్సరాల్లో మొత్తం రూ. 22 వేల కోట్ల మేర ఉద్యోగులకు చెల్లించడం పట్ల ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం ఉద్యోగుల ఆర్థిక భద్రతకు దోహదపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చూపుతున్న చొరవ ప్రశంసనీయమని తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకూరి పూర్ణచంద్రరావు, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు అర్రిబోయిన శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి యనమల ఆంజనేయులు మాట్లాడుతూ, ఉద్యోగుల హక్కుల పరిరక్షణలో ఇలాంటి చర్యలు మరింత ప్రోత్సాహకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు నల్లూరి నరసింహారావు, కోటా సుబ్బారావు, గోరంట్ల శ్రీను, నాగినేని నాగేశ్వరరావు, ఆళ్ల సుబ్బయ్య, జి. శ్రీనివాసరావు, రఘు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# దేశ సేవే బీజేపీ లక్ష్యం : బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్

**గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్):**భారతీయ జనతా పార్టీ (బీజేపీ) 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు జిల్లా కార్యాలయం 'వాజ్‌పేయ్ భవన్' వద్ద సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతి రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. 1980 ఏప్రిల్ 6న స్థాపితమైన బీజేపీ సాధారణ రాజకీయ పార్టీగా కాకుండా దేశ సేవకు అంకితమైన శక్తిగా ఎదిగిందని ఆయన పేర్కొన్నారు. దేశాభివృద్ధి, ప్రజల సంక్షేమం, "నేషన్ ఫస్ట్" సిద్ధాంతంతో పార్టీ నిరంతరం ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం "వికసిత భారత్" దిశగా వేగంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు.

పార్టీ కార్యకర్తల సేవాభావం, త్యాగస్ఫూర్తి వల్లే బీజేపీ



ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ శక్తిగా ఎదిగిందని కొనియాడారు. ప్రతి కార్యకర్త పార్టీకి బలమైన పునాది అని, గ్రామ స్థాయి నుండి బూత్ స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వంటి మహనీయుల ఆలోచనలు, సిద్ధాంతాల ఆధారంగానే పార్టీ ముందుకు సాగుతోందని ఆయన స్పష్టం చేశారు. "అంత్యోదయ" లక్ష్యంతో సమాజంలోని చివరి వ్యక్తికి న్యాయం జరిగేలా బీజేపీ కృషి చేస్తోందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతి రావు మాట్లాడుతూ, గుంటూరు జిల్లాలో పార్టీని మరింత బలపరచేందుకు కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. ప్రతి గ్రామం, ప్రతి బూత్‌లో పార్టీ ప్రభావాన్ని విస్తరించి, ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసే బాధ్యత ప్రతి కార్యకర్త తీసుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వంలో ప్రజల ఆశలు నెరవేర్చే దిశగా పార్టీ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పనతల సురేష్, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ భాష, కొత్తూరు వెంకట సుబ్బారావు, యడ్లపాటి స్వరూపరాణి, చిడిపోతు యశ్వంత్, దర్శనపు శ్రీనివాస్, ధారా సాంబయ్య, భీమినేని చంద్రశేఖర్, పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్, జంధ్యాల రామలింగేశ్వర శాస్త్రి, ఈదర శ్రీనివాసరెడ్డి, వై.వి. సుబ్బారావు, చరక కుమార్ గౌడ్, ఫైరోజ్ ఖాన్, నడ్డి నాగమల్లీశ్వరి, తోకల నాగరాజు, బజరంగ్ రామకృష్ణ, దేసు సత్యనారాయణ, రావూరి లక్ష్మీనారాయణ శాస్త్రి, క్రిష్టిపాటి నారాయణరెడ్డి, విమలాదేవి, సురేష్ జైన్, ఆమతి వెంకటరమణ తదితర నాయకులు పాల్గొన్నారు.

అలాగే జిల్లా మోర్చాల అధ్యక్షులు షేక్ సాంబశివరావు, శ్రీను నాయక్, డాక్టర్ రాధా మాధవి, తురక రామారావు, దారా అంబేద్కర్, తుంగ యశ్వంత్, అబ్దుల్ ఖుద్దూస్, షేక్ రఫీ, హరి పావని, సోలంకి, దుర్గాప్రసాద్, రాజేష్ నాయుడు, రామచంద్రరావు, శేషగిరి, మండల అధ్యక్షులు నరేష్, నాగమల్లేశ్వరి, మల్లాల లక్ష్మణ్ గౌడ్, షేక్ బాషా, కడియాల నందకిషోర్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగి, పార్టీ జెండాలు ఎగురవేస్తూ, "భారత్ మాతా కీ జై" నినాదాలతో కార్యకర్తలు హర్షధ్వానాలు వ్యక్తం చేశారు.

# అఖిల భారత బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శిగా పాండురంగ విఠల్

○ **పాండురంగ విఠల్‌కు ఘన సన్మానం**

**గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్):** భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, కిసాన్ మోర్చా రాష్ట్ర కోశాధికారి వెలవర్తిపాటి పాండురంగ విఠల్ అఖిల భారత బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శిగా ఎన్నికైన సందర్భంగా గుంటూరు జిల్లా బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో ఘన అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథి జూపూడి రంగరాజు మాట్లాడుతూ, వెలవర్తిపాటి పాండురంగ విఠల్‌కు లభించిన ఈ బాధ్యత ఆయన కృషి, నిబద్ధతకు వచ్చిన గౌరవమని పేర్కొన్నారు. బ్రాహ్మణ సమాజ సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సమగ్రంగా పనిచేసే నాయకత్వం అవసరమని, ఆ లక్ష్యంతో విఠల్ ముందుకు సాగుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. సమాజ అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. యువతలో సామాజిక బాధ్యతను పెంపొందిస్తూ, ఐక్యతతో ముందుకు సాగితే సమాజం మరింత అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. అనంతరం వెలగలేటి గంగాధర్ మాట్లాడుతూ, వెలవర్తిపాటి పాండురంగ విఠల్‌కు జాతీయ స్థాయిలో లభించిన ఈ గుర్తింపు బ్రాహ్మణ



సమాజానికి గర్వకారణమని అన్నారు. బ్రాహ్మణుల సంక్షేమం, విద్యా అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు వంటి అంశాల్లో మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా సంఘాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో ఐక్యత, పరస్పర సహకారం ఉంటేనే సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పలువురు బ్రాహ్మణ సేవా సంఘాల ప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని వెలవర్తిపాటి పాండురంగ విఠల్‌ను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. సభలో ఆయన భవిష్యత్ సేవలు మరింత విస్తృతంగా కొనసాగాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఏపీ ఎన్జీజీఓ అసోసియేషన్ గుంటూరు నగర శాఖకు నూతన కార్యవర్గం




**గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్):**ఏపీ ఎన్జీజీఓ అసోసియేషన్ గుంటూరు నగర శాఖలో ఖాళీగా ఉన్న పదవులను భర్తీ చేస్తూ నూతన కార్యవర్గాన్ని కో-ఆప్షన్ విధానంలో ఎన్నుకున్నారు. ఆదివారం సాయంత్రం జరిగిన కార్యవర్గ సమావేశానికి సహ అధ్యక్షురాలు డాక్టర్ వడ్లమూడి విజేత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షుడిగా చింతల కళ్యాణ్ కుమార్, కార్యదర్శిగా జివి కోటేశ్వరావు, ట్రెజరర్‌గా బి సాంబశివరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి అంకమ్మరావు, ఉపాధ్యక్షుడిగా బి సునీల్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా శరణ్య, డిఇసి సభ్యుడిగా బెన్వర్‌ను ఎన్నుకున్నారు. సమావేశానికి జిల్లా అబ్జర్వర్‌గా డి ధనుంజయ నాయక్ హాజరయ్యారు.

నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ, తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని కల్పించిన గుంటూరు జిల్లా జేఏసీ చైర్మన్, జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్ శ్రీనివాస్ సహకారాన్ని కొనియాడారు.

రాష్ట్ర అధ్యక్షుడు కామ్రేడ్ విద్యాసాగర్ మార్గదర్శకత్వంలో సంఘ అభివృద్ధి, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని నూతన నాయకత్వం పేర్కొంది. అదేవిధంగా రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించడం, ప్రభుత్వ ఉద్యోగులు మరియు పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రూ. 7300 కోట్లకు పైగా బకాయిలు చెల్లించడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# అరణ్ములలో కమలం వికసిస్తుంది: బీజేపీ ధీమా

**నేషనల్ డెస్క్(జర్నలిస్ట్ ఫైల్) :** అరణ్ముల నియోజకవర్గంలో బీజేపీ విజయం సాధించేందుకు ఎన్‌డీఏ శ్రేణులు సమగ్ర వ్యూహాలతో ముందుకు సాగుతున్నాయని బీజేపీ ఎన్నికల ఇంచార్జీ వల్లూరు జయప్రకాష్ నారాయణ తెలిపారు. సోమవారం అరణ్ముల మండలంలో నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో ఆయన పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, బీజేపీ అభ్యర్థి కుమ్మనం రాజశేఖరన్‌కు ప్రజల నుంచి విశేష మద్దతు లభిస్తోందని, ఈసారి అరణ్ములలో గెలుపు ఖాయమనే విశ్వాసం వ్యక్తం చేశారు. ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాలు సమన్వయంతో పనిచేస్తుండటం పార్టీకి బలంగా మారిందన్నారు. బూత్ స్థాయిలో పటిష్టమైన నిర్వహణతో ప్రతి




ఓటును పార్టీకి మళ్లించేలా కార్యాచరణ కొనసాగుతోందని తెలిపారు. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలు, పార్టీ విధానాలను ప్రజలకు వివరించాలని సూచించారు. బూత్ లెవల్ ఏజెంట్లు ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తారని, వారి సమన్వయంతో విజయాన్ని సాధించగలమని చెప్పారు.




అభ్యర్థి గెలుపు కోసం ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిస్తూ, అరణ్ములలో బీజేపీ విజయానికి అనుకూల వాతావరణం ఏర్పడిందన్నారు.

ఈ కార్యక్రమంలో అడ్వకేట్ హరిదాసు, మహారాష్ట్ర ఎమ్మెల్యే అమూల్, మండల అధ్యక్షులు దీపా నాయర్ తదితరులు పాల్గొన్నారు.

# దేశాభివృద్ధికి బీజేపీ మహనీయుల త్యాగాలే పునాది

○ **బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్**

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని స్టేడియం వద్ద పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ విగ్రహానికి బీజేపీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పాల్గొని పుష్పార్చన, దీపారాధన నిర్వహించారు.

ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ, దేశ నిర్మాణంలో పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ, శ్యామ ప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. వారి ఆలోచనలు, సిద్ధాంతాలు నేటి బీజేపీకి మార్గదర్శకాలని పేర్కొన్నారు. "అంత్యోదయ" సిద్ధాంతంతో చివరి వ్యక్తికి న్యాయం చేయాలనే లక్ష్యంతో బీజేపీ ముందుకు సాగుతోందని చెప్పారు.

బీజేపీ కార్యకర్తలు దీన్ దయాళ్ ఉపాధ్యాయ



ప్రతిపాదించిన మానవతా దృక్పథాన్ని అవగాహన చేసుకుని ప్రజాసేవలో ఆచరించాలని సూచించారు. దేశాభివృద్ధి కోసం పార్టీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.

ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలను గ్రామ స్థాయికి తీసుకెళ్లడం కార్యకర్తల బాధ్యత అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు చేరవేయాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా, జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి




**విజయవాడ, ( జర్నలిస్ట్ ఫైల్):**ఎన్నోకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పిఆర్టియు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నవాబ్ జాని, జిల్లా కార్యనిర్వహక అధ్యక్షుడు కోసూరి రాజశేఖర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వారు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం రాజమహేంద్రవరంలో జరిగిన పిఆర్టియు రాష్ట్ర కార్యనిర్వాహక సమావేశంలో పాల్గొన్న వారు, ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులు నాయుడు సమక్షంలో పిఆర్టియు రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి ఎయం గిరి ప్రసాద్‌లకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు సంబంధించిన పిఆర్సీ కమిటీని తక్షణమే ఏర్పాటు చేసి 30 శాతం ఫిట్‌మెంట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే పలు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 21న అన్ని జిల్లాల కలెక్టరేట్ల ముందు నిరసన కార్యక్రమాలు, 25న విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మద్రి ప్రభాకర్, నాయకుడు బలుసుపాటి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గ్రామంలో బీజేపీ జెండా ఎగురుతుంది

○ **ఆరు నెలల పాటు 'మన ఊరు -- మన జెండా' కార్యక్రమం**

○ **బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్**

**గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్):** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరులో సోమవారం ఉత్సాహభరితంగా వేడుకలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతి రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

మొదట నగరంలోని లక్ష్మీపురం వాజ్‌పేయి సర్కిల్ వద్ద మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన పీవీఎన్ మాధవ్,



బీజేపీ స్థాపనకు 46 సంవత్సరాలు పూర్తై 47వ సంవత్సరంలోకి ప్రవేశించిందని తెలిపారు. దేశ సేవే లక్ష్యంగా ప్రారంభమైన బీజేపీ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా ఎదిగిందని అన్నారు. "మన ఊరు -- మన జెండా" కార్యక్రమాన్ని ఆరు నెలల పాటు నిర్వహించి ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగురవేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు.

ప్రతి గ్రామ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని, గ్రామీణ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అటల్ బిహారీ వాజ్‌పేయి జీవితం, నాయకత్వం ప్రతి కార్యకర్తకు స్ఫూర్తిదాయకమని



కొనియాడారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం "వికసిత భారత్" దిశగా వేగంగా ఎదుగుతోందని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం భారీ స్థాయిలో నిధులు కేటాయించిందని, రాష్ట్రానికి మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల రూపంలో విశేష మద్దతు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కూటమి అజెండాతో పాటు బీజేపీ సిద్ధాంతాలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతి రావు మాట్లాడుతూ, గుంటూరు జిల్లాలో పార్టీ విస్తరణకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి బూత్ స్థాయిలో బలమైన నిర్మాణం చేపడతామని తెలిపారు. కార్యకర్తలే పార్టీ బలం అని, ప్రజల సమస్యల పరిష్కారానికి ముందుండాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో బెహరా గాయత్రి, పాలపాటి రవికుమార్, డాక్టర్ శ్రవంతి, లకరా, పవన్ సాయి, సోలంకి, మహాలక్ష్మి, అలాగే కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పనతల సురేష్, మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ భాషా, బీజేపీ సీనియర్ నేతలు యడ్లపాటి స్వరూపరాణి, కొత్తూరు వెంకట సుబ్బారావు, భీమినేని చంద్రశేఖర్, గంగాధర్, నేరళ్ళ మాధవరావు, వక్కలగడ్డ తిరుమలరావు, నాగేశ్వరరావు, బజరంగ్ రామకృష్ణ, దేసు సత్యనారాయణ, కారంశెట్టి రమేష్, శ్రావణ కుమారి, అనుమోలు ఏడుకొండలు గౌడ్, రాచుమల్లు భాస్కర్, జితేంద్ర గుప్తా, ప్రవీణ్, రావుల రాజశేఖర్, అబ్రహం, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగి, కార్యకర్తలు నినాదాలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. "భారత్ మాతా కీ జై" నినాదాలతో సభ ముగిసింది.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467